# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




పవిత్రత లోపించిన ఆలోచన, అపవిత్రమైన కార్యంతో సమానమైనదే. కోరికల్ని అదుపు చేస్తే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవచ్చు. లైంగిక శక్తిని ఆధ్యాత్మిక మార్గంలోకి మరల్చండి.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 44 బుధవారం 29 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# భారత ఆర్థిక వృద్ధి 6 శాతంగా అంచనా




**ప్రజాతపన ,ముంబాయి**

క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్, ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరానికి (2023-24 లేదా ఈజ24) భారతదేశ ఆర్థిక వృద్ధిని 6 శాతంగా అంచనా వేసింది. గతంలో కూడా ఇదే అంచనాను రేటింగ్ ఏజెన్సీ వెలువరించింది, దానిలో ఎలాంటి మార్పు చేయకుండా ప్రస్తుత అప్‌డేట్‌లోనూ కొనసాగించింది. తర్వాతి ఆర్థిక సంవత్సరాలైన 2024-25 ఒ 2025-26లో ఆర్థిక వృద్ధి 6.9 శాతానికి పెంచే అవకాశాలు ఉండవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఆశాభావం వ్యక్తం చేసింది.ఆసియా-పసిఫిక్ త్రైమాసిక ఆర్థిక సమాచారం అప్‌డేషన్‌లో భాగంగా.. భారత్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం రేటు 6.8 శాతం నుంచి 2023-24లో 5 శాతానికి తగ్గుతుందని ఎస్అండ్‌పీ పేర్కొంది. అయితే వాతావరణ సంబంధిత ప్రతికూల అంశాల కారణంగా ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని వెల్లడించింది. ద్రవ్యోల్బణ వృద్ధికి అడ్డుకట్ట వేసేందుకు, ఇప్పటికే అధిక స్థాయిలో ఉన్న కీలక వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరింత పెంచే అవకాశం ఉందని రేటింగ్స్ ఏజెన్సీ తెలిపింది. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2022-23 లేదా ఈజ23) 7 శాతంగా నమోదయ్యే మోదయ్యే అవకాశం ఉందని గ్లోబల్ రేటింగ్స్ సంస్థ తెలిపింది. అయితే, 2023-24 నాటికి ఇది 6 శాతానికి తగ్గుతుందని లెక్కలు వేసింది.2024-2026 సంవత్సరాల కాలంలో భారతదేశ వృద్ధి రేటు సగటున 7 శాతంగా ఉంటుందని నివేదిక పేర్కొంది. విడివిడిగా చూస్తే.. 2024-25 ఆర్థిక సంవత్సరం ఒ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 6.9 శాతం చొప్పున నమోదు అవుతుందని అంచనా వేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి 7.1 శాతానికి పెరుగుతుందని తెలిపింది.భారతదేశ ఆర్థిక వ్యవస్థ సాంప్రదాయికంగా దేశీయ డిమాండ్ ద్వారా నడుస్తుంది. కొంత ఆలస్యమైనా, గ్లోబల్ మార్కెట్లకు అనుగుణంగా భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా స్పందిస్తోంది. కమొడిటీల ఎగుమతులు పెరగడం దీనికి ఒక కారణం. 2022 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో, వార్షిక

(మిగతా 2లో)




# పాన్-ఆధార్ లింక్ గడువు పొడిగింపు

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

శాశ్వత ఖాతా నంబర్‌ను ఆధార్ నంబర్‌తో అనుసంధానించే గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. అయితే, ఈ డెడ్‌లైన్‌ను ప్రభుత్వం మరో 'రెండు నుంచి మూడు నెలల వరకు' పొడిగించే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ అధికారుల మాటలను బట్టి ఇది అర్థం అవుతోంది.పాన్-ఆధార్ నంబర్ అనుసంధాన గడువును పెంచుతూ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ త్వరలోనే ఒక నోటిఫికేషన్ జారీ చేయవచ్చని ఒక ప్రభుత్వ అధికారి ఒక జాతీయ వార్త పత్రికకు చెప్పారు. ఈ వార్త విషయంలో తన పేరు వెల్లడించవద్దని కోరారు.పాన్-ఆధార్ లింకింగ్ గడువు పెంచుతూ సిబీడీటీ నోటిఫికేషన్ జారీ చేసినా, ఆ కాలానికి ఆలస్య రుసుము (చెల్లించాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ ఇంకా రాలేదు కాబట్టి, పాన్-ఆధార్‌ను అనుసంధానించడానికి చివరి తేదీని మార్చి 31, 2023గానే ప్రస్తుతం లెక్కలోకి తీసుకోవాలి.ప్రభుత్వం ఇప్పటికే నాలుగు సార్లు ఈ గడువును పొడిగించింది.

(మిగతా 2లో)

# పీపీపీ విధానంలో ఇండస్ట్రియల్ పార్కులు



**ప్రజాతపన ,విశాఖ పట్నం :**

ఏపీ పారిశ్రామికాభివృద్ధిలో నూతన విప్లవానికి తెరతీస్తూ.. ఆంధ్రప్రదేశ్ సరికొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. 2023-27 సంవత్సరాలకు రూపొందించిన ఈ పాలసీని పారిశ్రామికవేత్తల సమక్షంలో ఆవిష్కరించింది. పాత పాలసీ గడువు ముగియక ముందే కొత్త పాలసీని ప్రకటించడం ఇదే తొలిసారి. సోమవారం విశాఖలో పారిశ్రామిక వేత్తలతో కూడిన సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల,

(మిగతా 2లో)



# మరోసారి ఢిల్లీకీ జగన్ మోహన్ రెడ్డి

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మరో?సారి ఢిల్లీ వెళ్తున్నారని సమాచారం. ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోయినా... ఆయన ఢిల్లీ వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. అయితే ఈసారి భేటీలో సీఎం ఎవరెవర్ని కలుస్తారు... టూర్ అజెండా ఏంటన్నది మాత్రం తెలియడం లేదు. మార్చి 16న ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి జగన్ ప్రధానమంత్రి, హోంమంత్రి అమిత్‌షా సహా పలువురు కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. ఈ టూర్ ముగిసి 15 రోజులు కాక ముందే మరోసారి ఢిల్లీ వెళ్తున్నారు సీఎం జగన్. సీఎం. అక్కడ జరుగుతున్న జీ20 గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన చర్చా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం బయల్దేరి అమరావతి చేరుకుంటారు. అక్కడి నుంచే ఉదయం ఢిల్లీ వెళ్లనున్నారు. మార్చి 17న

(మిగతా 2లో)

# టీడీపీ ఇచ్చిన షాక్‌కు జగన్‌కి 104 జ్వరం పట్టుకుంది



**ప్రజాతపన ,పుట్టపర్తి :**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన దెబ్బకు జగన్‌కి 104 జ్వరం పట్టుకుందని, ఇది టీడీపీ ఇచ్చిన షాక్ అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో సోమవారం యువగళం పాదయాత్ర 52వ రోజు జనసంద్రం నడుమ సాగింది. గోరంట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నారా లోకేశ్ ప్రసంగిం చారు. వైసీపీలో అక్రమాలు, అన్యాయాలు, అవినీతి గురించి ఆ పార్టీ ఎమ్మెల్యేలే మాట్లాడుతున్నారంటే.. జగన్ అరాచకాలను అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఇక వైసీపీ దుకాణం బంద్ అవ్వడం ఖాయమని, పసుపు దెబ్బకు వైసీపీ రెండు వర్గాలుగా విడిపోయిందని అన్నారు. ఒకటి రాజారెడ్డి వర్గం, రెండోది అంబేడ్కర్ వర్గం అని అన్నారు. రాజారెడ్డి వర్గానికి అధ్యక్షుడు జగన్ అయితే, అంబేడ్కర్ వర్గానికి ఉండవల్లి శ్రీదేవి అధ్యక్షురాలని తెలిపారు. అంబేడ్కర్ గారి బలం పెరుగుతోందని, రాజారెడ్డి బలం తగ్గుతోందన్నారు. జగన్‌ది చెత్త పరిపాలన అని తాను అనడం లేదని, వైసీపీ ఎమ్మెల్యేలే అంటున్నారని పేర్కొన్నారు. బానిస సంకెళ్లు తెంచుకున్న డాక్టర్ సుధాకర్, అచ్చెన్నని చంపినట్లు తనను చంపాలని చూస్తున్నారని ఉండవల్లి శ్రీదేవి అంటున్నారంటే.. వైసీపీ ప్రభుత్వం తీరు ఎలా ఉందో తెలుస్తోందని అన్నారు. వైసీపీలో 40 నుంచి 60 ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారని లోకేశ్ తెలిపారు. వైసీపీలో ఎమ్మెల్యేలకు గౌరవమే లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలు లోలోపల రగిలిపోతున్నారని అన్నారు.

# మాఫియా డాన్ అతీక్‌కు జీవిత ఖైదు



**ప్రజాతపన ,లక్నో**

ఉత్తరప్రదేశ్‌లో పేరొందిన మాఫియా డాన్ అతీక్ అహ్మద్.. ఉమేష్ పాల్ కిడ్నాప్ కేసులో దోషిగా తేల్చింది ప్రజాప్రతినిధుల కోర్టు. ఆయనకు జీవిత ఖైదు విధించింది. ఉమేష్ పాల్ కిడ్నాప్ కేసులో ప్రయాగ్‌రాజ్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు తీర్పు వెలువరించింది. 17 ఏళ్ల నాటి ఈ కిడ్నాప్ కేసులో మాఫియా అతిక్ అహ్మద్ ,

(మిగతా 2లో)

ప్రజా తపన
prajathapana.com
News that matters

# తెలుగు ఆచార్యులను వరించిన "అకాడమిక్ ఎక్స్ లెన్స్ అవార్డు"






**ప్రజా తపన, మైసూరు**

మైసూర్ లోని కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అధ్యాపకులలో అకడమిక్ పరంగా ఉత్తేజితులను చేయడానికి ఈ సంవత్సరం నుంచి అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు, మరియు బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డు పేరున రెండు అవార్డులను కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు ఈ ఏడాది నుండి ప్రధానం చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గారైన ఆచార్య శరణప్ప వి.హలసె గారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ పిలుపులో భాగంగా 2019 జనవరి నుండి 2022 డిసెంబర్ వరకు తమ తమ శైక్షణిక, పరిశోధనా వివరాలతో కూడిన విషయాలను విశ్వవిద్యాలయం అధికారులకు అధ్యాపకులు అకాడమిక్ ప్రోగ్రెస్ ను అందించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అకాడమిక్ పరంగా అందరికంటే ప్రథమ వరుసలో నిలిచిన తెలుగు విభాగాధిపతి ఆచార్య ఎం.రామనాథం నాయుడు గారిని అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. అవార్డుతోపాటు 25 వేల రూపాయల నగదు బహుమతిని కూడా ప్రధానం చేశారు. ఈ అవార్డును కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ గారైన ఆచార్య కే.ఎస్. రంగప్ప గారు ఆచార్య ఎం.రామనాథం నాయుడు గారికి అందజేశారు. అవార్డు అందజేసిన వేదిక మీద ప్రస్తుత వైస్ ఛాన్సలర్ గారైన ఆచార్య శరణప్ప వి.హలసె, రిజిస్ట్రార్ గారైన ఆచార్య కే.ఎల్.ఎన్. మూర్తి గారు, ఆచార్య ఎన్ లక్ష్మీ గారు, రిజిస్ట్రార్ ఎవల్యూషన్ గారైన ఆచార్య ప్రవీణ్ కుమార్ గారు ఆసీనులై న్నారు. ఈ అవార్డును ఆచార్య ఎం. రామనాథంనాయుడు అందుకోవడం పట్ల విశ్వవిద్యాలయంలోని ఉన్నతాధికారులంతా సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ప్రస్తుత వైస్ ఛాన్సలర్ గారైన శరణప్ప వి.హలసే గారు తెలుగు విభాగం అధిపతి చేస్తున్న శైక్షణిక కార్యక్రమాలను అభినందించారు. అవార్డు అందుకోవడం పట్ల ఆచార్య ఎం. రామనాథం నాయుడు గారు స్పందిస్తూ తన వృత్తిలో భాగంగానే ఈ అవార్డులు నన్ను వరించాయని తెలియజేశారు. అవార్డును అందుకోవడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తపరిచారు.


# మరోసారి ఢిల్లీకీ జగన్ మోహన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటు ఆవరణలోని ప్రధాని కార్యాలయంలో మోదీతో జగన్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై మోదీతో చర్చించినట్టు ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్ఆర్ సీపీ ఎంపీలు కూడా సీఎం జగన్ వెంట ఉన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా జగన్ కలిశారు. రాష్ట్ర విభజన జరిగి 9 సంవత్సరాలు కావొస్తున్నా.. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన చాలా ద్వైపాక్షిక అంశాలు పరిష్కారం జరగలేదన్నారు జగన్. గతంలో తాను ప్రస్తావించిన అంశాలపై కేంద్రం ఆర్థికశాఖ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారని.. అయినా కీలక అంశాలన్నీ ఇంకా పెండింగులోనే ఉన్నాయన్నారు. 2014?15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్ల రూపాయలు పెండింగులో ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖజానానుంచి రూ.2600.74 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా.. 2 సంవత్సరాలుగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ. 55,548 కోట్లుగా నిర్ధారించిందని వెంటనే ఆమోదం తెలపాల్సిందిగా కోరారు. తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్కోకు రావాల్సిన బకాయిలు కూడా గుర్తు చేశారు. 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరాచేసిన విద్యుత్తుకు రూ.7,058 కోట్లు రావాల్సి ఉందన్నారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటనపై టీడీపీ నేతలు వ్యంగ్యపు ట్వీట్లు చేశారు. ఓ వైపు వైఎస్ వివేకా హత్య కేసు.. ఇంకో వైపు లిక్కర్ కేసు.. రెండు కేసుల్లో సీబీఐ, ఈడీ దూకుడుగా ఉన్నాయని అందుకే జగన్ ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుందని టీడీపీ నేతలు అప్పట్లోనే విమర్శలు చేశారు.

# వివేకానందరెడ్డి మర్డర్ వ్యవహారం ఇప్పట్లో తేలదా?

**అమరావతి** :



వివేకానందరెడ్డి మర్డర్ జరిగి ఇప్పటికి నాలుగున్నరేళ్ళయ్యింది. ఇంతవరకు కేసు దర్యాప్తులో ఎలాంటి పురోగతి కనబడలేదు. పైగా సాక్ష్యాలు సాక్షుల వ్యవహారమంతా గందరగోళంగా తయారైంది. కొందరు సాక్ష్యులు చనిపోయారు. అలాగే కొన్ని సాక్ష్యాలు చెరిగిపోయాయి. నిందితులుగా సీబీఐ అరెస్టుచేసిన వారిలో కొందరు అడ్డంతిరిగారు. ఇన్ని సంవత్సరాలు దర్యాప్తుచేసిన సీబీఐ కచ్చితమైన సాక్ష్యాలను సేకరించలేకపోయింది. పైగా దర్యాప్తు అధికారులపైనే అనేక అనుమానాలు పెరిగిపోతున్నాయి. 2018లో వివేకా హత్య జరిగినపుడు చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నారు. ఘటన జరగ్గానే పోలీసులు విచారణ మొదలుపెట్టారు. తర్వాత కొన్నిరోజులకు సిట్ విచారణ అన్నారు. తర్వాత ప్రభుత్వం మారిపోయి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. టీడీపీ హయాంలో వేసిన సిట్ విచారణను రద్దుచేసి కొత్తగా వేరే అధికారులతో సిట్ అన్నారు. ఇంతలో వివేకా కూతురు డాక్టర్ సునీత కోర్టులో వేసిన పిటీషన్ ఆధారంగా సీబీఐ ఎంటరయ్యింది. ఇక అక్కడినుండి కేసులో అన్నీ గొడవలే. సీబీఐ కొందరినే టార్గెట్ గా పెట్టుకుని విచారిస్తోందని కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఆయన తండ్రి భాస్కరరెడ్డి పదేపదే ఆరోపిస్తున్నారు. ఇదే ఆరోపణతో నిందితుల్లో ఒకడైన శివశంకర్ రెడ్డి భార్య తులశమ్మ సుప్రింకోర్టులో పిటీషన్ వేశారు. దాని ఫలితంగానే దర్యాప్తు కొత్త అధికారికి అప్పగించమని సుప్రింకోర్టు ఆదేశించింది. దర్యాప్తు బాధ్యతలను కొత్త అధికారికి అప్పగించమని చెబుతునే పాత అధికారి కూడా ఉంటారని చెప్పటమే విచిత్రం. ఎంపీ తదితరులేమో వివేకా కుటుంబంపైనే అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. సీబీఐ ఇంతవరకు ఆ దిశగా విచారణే చేయలేదు. దాంతో అందరికీ దర్యాప్తుపై అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఒకే కేసును ఇద్దరు అధికారులు ఎలా దర్యాప్తు చేయగలరో అర్ధంకావటంలేదు. కొత్తగా వచ్చిన అధికారిని ఇప్పటికే దర్యాప్తు చేస్తున్న అధికారి తన పద్దతిలోనే గైడ్ చేయచ్చు. లేదా కొత్త అధికారి పాత అధికారిని పట్టించుకోకపోవచ్చు. ఇద్దరు ఒకే కేసును దర్యాప్తుచేస్తుంటే ఏదో సమయంలో గొడవలు జరిగే అవకాశముంది. దాంతో కేసు మరింత సంక్లిష్టంగా మారే అవకాశముంది. మొత్తానికి కేసంతా బాగా గందరగోళమైపోయింది. అందుకనే కేసు దర్యాప్తు ఇక అటకెక్కినట్లే అనే ప్రచారం మొదలైపోయింది.

# ఆక్వారంగాన్ని సిఏఏ పరిధిలోకి తీసుకురావాలి

**కాకినాడ :**



ఆక్వారంగాన్ని కోస్టల్ ఆక్వాకల్చర్ అధారిటీ (సీఏఏ)పరిధిలోకి తీసుకురావాలని ఆల్ ఇండియా ష్రింప్ హెచరీస్ అసోసియేషన్ సూచించింది. మంగళవారం రాంకోసా అసోసియేషన్లో కాకినాడ రీజియన్ చాప్టర్ ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ చాప్టర్ అధ్యక్షుడు సత్తి వీర్రెడ్డి మాట్లాడుత ఆక్వా రంగం ఏర్పాటు కోసం పలు కేంద్ర సంస్థల అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండేదని వాటి వల్ల తాము అనేక రకాలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలంటే ఆక్వారంగాని సిఏఏ పరిధిలోకి తీసుకువచ్చి తమకు సింగిల్ విండో పథకాన్ని అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వ చట్టాల్లో మార్పులు చేయాలని వీర్రెడ్డి సూచించారు కాకినాడ తీర ప్రాంతంలో సుమారు 200 నుంచి 300 వరకు హేచరీలు ఉన్నాయని వాటి ద్వారా నాణ్యమైన ఉత్పత్తి జరగడమే కాక పలువురు జీవనోపాధిని పొందుతున్నారన్నారు. ఈ ప్రాంతం నుండి మహారాష్ట్ర ఒరిస్సా పశ్చిమ బెంగాల్ కర్ణాటక వంటి రాష్ట్రాలకు కూడా రొయ్య పిల్లలను ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారకద్రవ్యంను అర్జించి ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తుందని వీర్రెడ్డి తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జి వెంకటేశ్వరరావు సభ్యులు బడే విజయ్ కుమార్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్వా రంగం సిఆర్జెడ్ వల్ల రొయ్య రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అందువల్ల తమ ఆక్వారంగాన్ని సీఏఏలోకి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు ఎస్వీఆర్ కుమార్, ఎన్ ప్రభాకర్ రావు, ప్రత్తిపాటి వీరభద్ర కుమార్, రైతు రఘు తదితరులు పాల్గొన్నారు

# భారత ఆర్థిక వృద్ధి 6 శాతంగా అంచనా

(మొదటిపేజీ తరువాయి)

ప్రాతిపదికన, ఉఆఖ వృద్ధి 4.4 శాతానికి నెమ్మదించింది" గ్లోబల్ రేటింగ్స్చైనా ఆర్థిక వృద్ధి పుంజుకుంటుంది ఆసియా-పసిఫిక్ ప్రాంతం విషయంలో "జాగ్రత్తతో కూడిన సానుకూల దృక్పథం"నూడఖ రేటింగ్స్ ప్రకటించింది. చైనా ఆర్థిక వ్యవస్థ ఈ సంవత్సరం తిరిగి పుంజుకుంటుందని పేర్కొంది .చైనాలో రికవరీ దాదాపుగా ఆర్గానిక్ మార్గంలో ఉంటుందని విశ్వసిస్తున్నట్లు రేటింగ్స్ ఏజెన్సీ వివరించింది. వినియోగం, సేవల రంగాలు ఆ దేశ ఆర్థిక వృద్ధికి నాయకత్వం వహిస్తాయని వెల్లడించింది. నవంబర్ నాటి అంచనా 4.8%ను మించి ఈ సంవత్సరం ఆ దేశం ఉఆఖ వృద్ధి 5.5%కు చేరుతుందని అంచనా. మార్చి నెలలో నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ సమావేశాల్లో ప్రకటించిన 5% లక్ష్యాన్ని కూడా ఇది మించిపోయిందని అని గ్లోబల్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ లూయిస్ కుయిజ్ చెప్పారు.

# పాన్-ఆధార్ లింక్ గడువు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

చివరిసారిగా.. 2022 మార్చి 30న, పాన్-ఆధార్ నంబర్ అనుసంధాన డెడ్‌లైన్‌ను ఒక సంవత్సరం పాటు పొడిగించిన కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డ్, 2022 ఏప్రిల్ 1 నుంచి మూడు నెలల వరకు రూ. 500 ఆలస్య రుసుమును వసూలు చేసింది. ఆ తర్వాత రూ. 1000 లేట్ ఫీజ్ నిర్ణయించింది. 2023 మార్చి 31వ తేదీ లోగా తమ పాన్‌ను ఆధార్ సంఖ్యతో అనుసంధానించడంలో విఫలమైన వ్యక్తుల పాన్ నిష్క్రియంగా మారుతుంది. తద్వారా, పాన్ సమాచారాన్ని మీరు ఉద్దేశపూర్వకంగా ఆదాయ పన్ను విభాగానికి అందించనట్లు పరిగణిస్తారు. పాన్ సమాచారం తెలియజేయడంలో విఫలమైనందుకు ఆదాయపు పన్ను చట్టం ప్రకారం వర్తించే అన్ని పరిణామాలు లేదా చర్యలు అటువంటి పన్ను చెల్లింపుదార్లకు వర్తిస్తాయని ఆదాయ పన్ను విభాగం చెప్పింది. ప్రతి ఒక్కరి కేవైసీలో పాన్, ఆధార్ ముఖ్యమైన భాగం. పాన్‌ను ఆధార్‌తో లింక్ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీనివల్ల నకిలీ పాన్ కార్డుల వినియోగాన్ని నిరోధించవచ్చు. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులు ఉన్న కేసులు కూడా చాలా బయటపడ్డాయి. ఇలాంటి వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. పాన్‌ను ఆధార్ సంఖ్యతో అనుసంధానించడంలో విఫలమై పాన్ కార్డ్ డియాక్టివేట్ అయితే, అప్పుడు సదరు పన్ను చెల్లింపుదారు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయలేడు. అలాగే, కొత్త పాన్ పొందేందుకు ఆధార్‌ను ఇవ్వడం తప్పనిసరి. ఆధార్ - పాన్ లింక్ చేయకపోతే ఈ విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతాయి. దీంతో పాటు... కొత్తగా ఒక బ్యాంక్ అకౌంట్ లేదా డీమ్యాట్ అకౌంట్ వంటివి కూడా ఓపెన్ చేయలేడు. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు పెట్టలేడు. కాబట్టి, మీరు ఇప్పటికీ మీ పాన్ - ఆధార్ అనుసంధానాన్ని పూర్తి చేయకపోతే తక్షణమే ఆ ప్రక్రియ పూర్తి చేయండి.

# పీపీపీ విధానంలో ఇండస్ట్రియల్ పార్కులు

(మొదటిపేజీ తరువాయి)

ఐటీ శాఖలు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నూతన పారిశ్రామిక విధానాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి దోహదం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా నిర్మాణాత్మక ఇండస్ట్రియల్ పాలసీని ప్రభుత్వం రూపొందించింది అన్నారు అమర్‌నాథ్. నూతన విధానం పారిశ్రామికాభివృద్ధిలో విప్లవాన్ని సృష్టిస్తుందని పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈనెల 31వ తేదీతో పాత విధానం ముగియనుండడంతో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పారిశ్రామిక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ సలహాదారు శ్రీధర్, ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వకరికాల వలవన్, జేడీ రామలింగరాజు, డైరెక్టర్ డా.జి సృజన, ఏపీఐడీసీ ఛైర్ పర్సన్ బండి పుణ్యశీల, సీఐఐ ఏపీ చాప్టర్ వైస్ ఛైర్మన్ డా.మురళీ కృష్ణ, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ప్లగ్ అండే ప్లే విధానానికి అనుగుణంగా పాలసీ రూపొందించారు. వనరుల ఆధారంగా అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన జరుగనుంది. వ్యాపారన్ని సులభతరం చేయడం, పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ కొత్త పాలసీ తయారు చేసినట్టు మంత్రి అమర్‌నాథ్ వివరించారు. పరిశోధనలకు చేయూత, అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించడం ముఖ్యమైందిగా తెలిపారు. తయారీ, అనుబంధ రంగాలు సహా అన్ని రకాల పరిశ్రమల పెట్టుబడిదారులకు పలు రాయితీలు ఇవ్వడం, ఎర్లీబర్డ్ పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కల్పించడం మరింత ముఖ్యమన్నారు. ఎలాంటి ఆంక్షలు లేని పెట్టుబడుల వాతావరణం కల్పిస్తున్నట్టు వివరించారు. లో కాస్ట్, లో రిస్క్ బిజినెస్. పీపీపీ విధానంలో ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి. ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తారు. అంతర్జాతీయ కనెక్టివిటీ, తయారీ రంగంలో ఎకో సిస్టమ్. దుబాయ్ తరహాలో బెస్ట్ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి. పర్యావరణ పరిరక్షణ, అన్ని జిల్లాల్లోనూ పారిశ్రామిక వికేంద్రీకరణ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. తొలిసారిగా ఆపరేషనల్ గైడ్ లైన్స్ లో భూ కేటాయింపులు, రద్దు మొదలైనవి ఈ పీపీపీ విధానంలో ఉన్నాయన్నారు.

# మాఫియా డాన్ అతీక్‌కు జీవిత ఖైదు

(మొదటిపేజీ తరువాయి)

అతని సోదరుడు సహా 10 మంది నిందితులను కోర్టు దోషులుగా నిర్ధారించింది. మంగళవారం మధ్యాహ్నం కోర్టు తీర్పు వెలువరించింది. 2005లో జరిగిన రాజుపాల్ హత్య కేసులో కీలక సాక్షి అయిన ఉమేష్ పాల్ హత్యకు అహ్మద్, అష్రఫ్‌లు కూడా కుట్ర పన్నారనే ఆరోపణలు ఉన్నాయి. బీఎస్పీ ఎమ్మెల్యే రాజుపాల్ హత్యకేసులో ప్రధాన సాక్షి ఉమేష్‌పాల్‌కు సంబంధించిన కేసులో కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో 2006 ఫిబ్రవరి 28న అతిక్ అహ్మద్, అష్రఫ్ ఉమేష్ పాల్‌ను కిడ్నాప్ చేశారు. ఉమేష్ పాల్‌ను కొట్టి, అతని కుటుంబంతో కలిసి చంపేస్తానని బెదిరించి, కోర్టులో బలవంతంగా అఫిడవిట్ దాఖలు చేశారు. 2007లో మాయావతి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, జూలై 5, 2007న, ఉమేష్ పాల్ అతిక్ మరియు అష్రఫ్‌తో సహా ఐదుగురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పోలీసుల విచారణలో మరో ఆరుగురి పేర్లు తెరపైకి వచ్చాయి. అతిక్, అష్రఫ్ సహా 11 మందిపై కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ 2009లో ప్రారంభమైంది. ప్రాసిక్యూషన్ నుంచి అంటే ప్రభుత్వం తరఫున మొత్తం 8 మంది సాక్షులను హాజరుపరిచారు. ఈ కేసులో 11 మంది నిందితుల్లో అన్సార్ బాబా అనే నిందితుడు చనిపోయాడు. అతీక్, అష్రఫ్ సహా మొత్తం 10 మంది నిందితులపై కోర్టు మంగళవారం తీర్పు వెలువరించిం2019 జూన్ నుంచి సబర్మతి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గుజరాత్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మోహిత్ జైశ్వాల్ కిడ్నాప్, దాడి కేసులో అతన్ని జైలుకు తరలించారు. జైలులో ఉన్న అతిక్ అహ్మద్ ను ఈ కేసు తీర్పు కోసం ఉత్తరప్రదేశ్‌కు తీసుకువచ్చారు. అతిక్ అహ్మద్‌పై సుమారు వంద క్రిమినల్ కేసులు ఉన్నాయి. తాజాగా ఉమేశ్ పాల్ హత్య కేసులో కూడా శిక్ష ఖరారయింది. గ్యాంగ్‌స్టర్ వికాశ్ దూబే తరహాలోనే అతిక్ అహ్మద్‌ను హతమారుస్తారన్న ఊహాగానాలు వినిపించాయి. అందుకే తాను గుజరాత్ జైల్లోనే ఉంటానని.. తనకు విధించే శిక్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విధించాలని ఆయన కోరారు. అయితే కోర్టు ఆయన అభ్యర్థనను పట్టించుకోలేదు. జీవితాంతం జైల్లో ఉండేలా తీర్పు చెప్పింది.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# తిరుమలలో నో పొల్యూషన్ బస్సులు

**తిరుమల :**

తిరుమలలో సామాన్య భక్తుల కోసం 10 ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మెన్ వైవీ.సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ధర్మరథాల పేరుతో సామాన్య భక్తుల సౌకర్యార్థం డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తిరుమలలో భక్తులను ఉచితంగా గమ్యస్థానాలకు చేరుస్తాయని తెలిపారు. ఒక్కో బస్సు విలువ కోటి 80 లక్షల ఉంటుందని మొత్తం 18 కోట్లు విలువచేసే పది ఒలెక్ట్రా కంపెనీ బస్సులను మెగా ఇంజినీరింగ్ సంస్థ విరాళంగా అందజేసిందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలలో పర్యావరణ కాలుష్యం నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఏడాది క్రితమే ప్రారంభించామని అన్నారు. అందులో భాగంగా అధికారులు సిబ్బందికి విధి నిర్వహణ కోసం ఎలక్ట్రిక్ కార్లను ఇచ్చామని తెలిపారు. అనంతర కాలంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ చొరవతో 65 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ప్రతిరోజు తిరుపతి నుంచి తిరుమల మధ్య నడుపుతోందని అన్నారు. తాజాగా పది ఎలక్ట్రిక్ బస్సుల కూడా ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటికే తిరుమలలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. లడ్డు కౌంటర్లలో ప్లాస్టిక్ రహిత కవర్లతో పాటు తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్లను పూర్తిస్థాయిలో నిషేధించామని తెలిపారు.రాబోయే రోజుల్లో తిరుమలలో పర్యావరణం కాపాడేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. "భక్తుల కోసం ఉచిత బస్సులను టీటీడీ నడుపుతుంది. తిరుమల కొండపై పర్యావరణ కాపాడేలా పది ఎలక్ట్రిక్ బస్సులు మెగా సంస్థ టీటీడీకి అందించింది. వారంలో రోజుల్లో ఈ బస్సులు తిరుమలలో అందుబాటులోకి రానున్నాయి. తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వల్ల గదుల కేటాయింపు పారదర్శంగా జరుగుతుంది. వేసవిలో భక్తులకు ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. మాడ వీధుల్లో చల్లటి పాయింటింగ్, చలువపందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్నాం. వేసవిలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తాం. ఎఫ్.సి.అర్.ఏ నిభందనలకు విరుద్ధంగా విదేశాల నుంచి విరాళాలు స్వీకరించినందుకు టీటీడీ ఆర్బీఐ 3 కోట్ల జరిమానా వేసింది. ఆర్బీఐ వేసినా జరిమానాను త్వరలో కట్టేస్తాం. త్వరలో విదేశాల నుంచి వచ్చే ఎఫ్.సి.ఆర్.ఏ లైసెన్స్ ద్వారా విరాళాలు తిరిగి తీసుకుంటాం. టీటీడీకి ఉన్న ఎఫ్.సి.ఆర్.ఏ లైసెన్స్ కాలపరిమితి ముగియడంతో రెన్యూవల్ చేయమని ఆర్బీఐను కోరాం. హుండీలో కానుకల ద్వారా టీటీడీ ఖజనాలో రూ.30 కోట్లు విదేశీ కరెన్సీ ఉంది."–వైవీ.సుబ్బారెడ్డి మేఘా ఇంజినీరింగ్ ఉ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) తిరుమలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానానికి ఉచితంగా పది ఎలక్ట్రిక్ బస్సుల అందించింది. ఎంఈఐఎల్ గ్రూప్ అనుబంధ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్ టెక్? లిమిటెడ్ ఈ బస్సులను హైదరాబాద్ సమీపంలోని తన ప్లాంట్ లో తయారు చేసింది. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన తొలి బస్సును ఇటీవల దేవస్థానం రవాణా విభాగం జనరల్ మేనేజర్ పీవీ శేషారెడ్డి సమగ్రంగా పరిశీలించారు. ఒలెక్ట్రా తయారు చేసిన అత్యాధునిక సౌకర్యాలు కలిగిన 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానానికి అందించాలని ఎంఈఐఎల్ నిర్ణయించిన విషయం తెలిసిందే. వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు పరిశుభ్రమైన, వాయు, శబ్ధ కాలుష్యంలేని ప్రయాణాన్ని ఈ విద్యుత్ బస్సుల ద్వారా అందించాలేని ఈ బస్సులు అందించినట్లు ఒలెక్ట్రా ప్రతినిధులు తెలిపారు. ఒలెక్ట్రా అందిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు తిరుమలను పర్యావరణ హితంగా మార్చుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# రాహుల్ అస్త్రంగా కేసీఆర్

**హైదరాబాద్ :**

రాహుల్ గాంధీపై అనర్హత వేటును కేసీఆర్ తన జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పాలన్న ఆకాంక్షను నెరవేర్చుకునేందుకు ఒక అవకాశంగా భావిస్తున్నారా అంటే ఔననే అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఇప్పటి వరకూ కాంగ్రెస్సేతర , బీజేపీయేతర కూటమి, ఫ్రంట్ అంటూ కాలికి బలపం కట్టుకు తిరిగినా జాతీయ స్థాయిలో కేసీఆర్ మార్క్ రాజకీయాలకు పెద్దగా స్పందన రాలేదు. దీంతో ఆయనే సొంత కుంపటి పెట్టుకుని తన వంతు ప్రయత్నాలు తాను సాగిస్తున్నా.. ఆ ప్రయత్నాలు ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి.ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లో తప్ప మరే రాష్ట్రంలోనూ చివరాఖరికి తెలంగాణలో కూడా బీఆర్ఎస్ కమిటీలు ఏర్పాటైన దాఖలాలు లేవు. ఈ లోగానే ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితపై ఆరోపణలు, విచారణలు, టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థి, నిరుద్యోగులలో కేసీఆర్ సర్కార్ పై తీవ్ర ఆగ్రహం నిరసనల రూపంలో వ్యక్తం అవుతుండటంతో ఆయన జాతీయ అడుగులకు విరామం తప్పదా అన్న అనుమానాలు రేకెత్తాయి. అందుకు తగ్గట్టుగానే కవితను ఈడీ విచారణ నేపథ్యంలో ఆయన తెలంగాణ సెంటిమెంటును మళ్లీ తెరపైకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించడంతో వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీఆర్ఎస్ జాతీయ స్థాయిలో పెద్దగా ప్రభావం చూపే అవకాశాలు కనిపించడం లేదని పరిశీలకులు విశ్లేషణలు సైతం చేశారు.సరిగ్గా ఇదే సమయంలో క్రిమినల్ డిఫమేషన్ కేసులో రాహుల్ కు గుజరాత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడం, దాంతో పార్లమెంటు ఆయనపై అనర్హత వేటు వేయడంతో కేసీఆర్ మరోసారి జాతీయ స్థాయిలో తన గళం బలంగా వినిపించేందుకు నడుం బిగించారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనకు మద్దతుగా నిలవడానికి రెడీ అయిపోయారు. అంతే కాదు ఆ ఆందోళనలో క్రీయాశీలంగా వ్యవహరించాలని కూడా నిర్ణయించారు. పలు ప్రాతీయ పార్టీల నాయకులతో ఇప్పటికే మంతనాలు ప్రారంభించారని కూడా చెబుతున్నారు. రాహుల్ గాంధీకి సంఫీుభావం ప్రకటించేందుకు ఆయన స్వయంగా ఢిల్లీ వెళ్లాలని కూడా భావిస్తున్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి.రాహుల్ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్ సభ గెజిట్ విడుదల చేసిన వెంటనే సీఎం కేసీఆర్ ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రకటన విడుదల చేశారు. రాహుల్ సభ్యత్వం రద్దుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేపట్టనున్న దేశ వ్యాప్త ఆందోళనకు కేసీఆర్ మద్దతు ప్రకటించాలని కేసీఆర్ నిర్ణయించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంలో ఆయన తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్, జేడీయూ అధినేత నితీష్ కుమార్, తమిళనాడు సీఎంస్టాలిన్ తో సంప్రదింపులు జరుపుతున్నారని కూడా చెబుతున్నాయి.

# నెల్లూరు వైసీపీలో పడనున్న మరొక వికెట్

**నెల్లూరు :**

నెల్లూరు జిల్లాలో ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలపై వైసీపీ వేటు వేసింది. మంత్రి పదవులు రాని ఒకరిద్దరు ఇంకా అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే వారెవరూ పార్టీ లైన్ దాటలేదు, ఎక్కడా పల్లెత్తు విమర్శ కూడా చేయలేదు. పైగా అవకాశం వస్తే మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకి చాకిరేవు పెట్టడానికి బాగా ఉత్సాహం చూపిస్తారు. అలాంటి ఎమ్మెల్యేలపై కూడా ఇప్పుడు వాట్సాప్ లో ప్రచారం హోరెత్తిపోతోంది. తాజాగా కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నారంటూ నెల్లూరు వాట్సప్ గ్రూపుల్లో ఓ మెసేజ్ తెగ వైరల్ అవుతోంది. నెల్లూరు రాజకీయాల్లో ఇది హాట్ టాపిక్ గా మారింది. ప్రసన్నకుమార్ రెడ్డి.. 2012 నుండి జగన్ కు అండగా నిలిచిన సీనియర్ నాయకుడు 2019 తర్వాత తనకు ఖచ్చితంగా మంత్రి పదవి వస్తుంది అని ఆశించిన ప్రసన్నకుమార్ రెడ్డిమంత్రి పదవి అటుంచితే .. తనకు రావాల్సిన పెండింగ్ బిల్లులు కూడా రావట్లేదు అని అనుచరుల దగ్గర వాపోయిన ప్రసన్నకుమార్ రెడ్డి. పార్టీలో కనీస గౌరవం లేదు అని అసంతృప్తిపార్టీ మారడం తప్ప తనకు వేరే మార్గం లేదని అనుచరులకు స్పష్టం చేసిన ప్రసన్నకుమార్ రెడ్డి టీడీపీ బీజేపీలలో ఒక పార్టీలో చేరే అవకాశం ఉందని తెలిపిన ప్రసన్నకుమార్ రెడ్డిఈ విషయంపై మరికొద్ది రోజుల్లో మరికొంత స్పష్టత వచ్చే అవకాశం.."ఇదీ ఆ మెసేజ్ సారాంశం. ఎవరో పొలిటికల్ అనలిస్ట్ వార్త రాశారా అనేలా కనిపిస్తున్న ఈ న్యూస్ ను ఫార్వార్డ్ చేసినట్టుగానే ఒక ఫేక్ వార్త సృష్టించారనిపిస్తోంది. సీఎం జగన్ పై అసంతృప్తితో రగిలిపోతున్నారని, ఆయన పార్టీ మారతారని అంటున్నారు. ఇందులో టచ్ చేసిన పాయింట్ కూడా మరీ అంత తీసిపారేసేలా లేదు. మంత్రి పదవి రాలేదనే ఉద్దేశంతో ప్రసన్న పార్టీ మారతారంటున్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి జగన్ తోనే ఉన్న అతికొద్దిమంది నేతల్లో ప్రసన్న కూడా ఒకరు. సీనియర్ నేత, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. అలాంటి నల్లపురెడ్డి ప్రసన్నకు సీఎం జగన్ మంత్రి పదవి ఇవ్వకుండా పక్కనపెట్టారు. దీంతో సహజంగానే ఆయనలో అసంతృప్తి ఉంటుంది. కానీ ఆయనెప్పుడూ బయటపడలేదు. ఇటీవల నెల్లూరు బ్యారేజ్ కి నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి పేరుని ఖరారు చేశారు సీఎం జగన్. ఆ పేరుతో ప్రసన్నను కాస్త కూల్ చేయాలనుకున్నారు. ఆమధ్య గడప గడప కార్యక్రమంలో కూడా హుషారుగా లేరంటూ చురకలంటించారు. ఆ తర్వాత ప్రసన్న గడప గడపలో స్పీడ్ పెంచారు. జగన్ ఇచ్చిన టార్గెట్ ని రీచ్ అవుతున్నారు. ఐప్యాక్ దృష్టిలో పడేందుకు ప్రచారాన్ని కూడా ముమ్మరం చేశారు. ప్రస్తుతానికి ఆయనెక్కడా జగన్ కి వ్యతిరేకంగా నోరు మెదపలేదు. ఇటీవల నలుగురు ఎమ్మెల్యేలపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన తర్వాత కూడా ప్రసన్న కుమార్ రెడ్డి అధిష్టానానికి సపోర్ట్ గా మాట్లాడారు. చంద్రబాబుపై ధ్వజమెత్తారు. ఆ నలుగురిపై విరుచుకుపడ్డారు. అలాంటి ప్రసన్న సడన్ గా పార్టీకి దూరం ఎందుకు జరుగుతారు. చంద్రబాబుని జీవితంలో ఎవరూ తిట్టనన్ని తిట్లు తిట్టాడు కాబట్టి, ఆయన టీడీపీలో చేరే అవకాశమే లేదు. అలాగని బీజేపీలో చేరి రాజకీయ జీవితాన్ని నాశనం చేసుకునేంత అమాయకుడు కూడా కాదు. పోనీ ప్రసన్నకు కోవూరు టికెట్ ఇవ్వనని జగన్ చెప్పారా అంటే అలాంటి ప్రచారం కూడా లేదు. మరి అసలు నిప్పే లేకుండా ఈ పొగ ఎలా వస్తోంది. ఈ పొగ ఎవరు పెట్టారనేది తేలాల్సి ఉంది.

# కొత్త ఓట్ల నమోదుకు అవకాశం

**హైదరాబాద్ :**

కొత్త ఓటర్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకున్నా, అందులోని వివరాలను మార్చుకోవాలి అనుకున్నా, కార్డు ట్రాన్స్ ఫర్ చేయించుకోవడం వంటివి చేసుకోవడం కోసం మరో కొత్త వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో ఉన్న ఓటర్ పోర్టల్ సర్వీస్(ఎన్వీపీఎస్) వెబ్ సైట్ కు బదులుగా "ఓటర్స్" పేరుతో కొత్త వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ప్రకటించారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, జాబితా నుంచి పేరు తొలగింపు, చిరుమానా మార్పు వంటి అవసరాలకు 6, 6ఏ, 7, 8 వంటి ఫారాలను వినియోగిస్తూ ఇకపై కొత్త వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని, పాత వెబ్ సైట్ కు ఇక పని చేయదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అయితే కొత్త వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకున్న తర్వాత విశిష్ట రిఫరెన్స్ నంబర్ ను ఎస్ఎంస్, మెయిల్ ద్వారా దరఖాస్తుదారులకు పంపిస్తామన్నారు. ఈ నెంబర్ ద్వారా దరఖాస్తు స్థితిగతులను తెలుసుకోవచ్చు అని చెప్పుకొచ్చారు. కొత్త పోర్టల్ ద్వారా ఓటర్ల జాబితాను పరిశీలించవచ్చని, ఓటరు గుర్తింపు కార్డు కోసం, ఓటరు కార్డులో మార్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ ఏ పోలింగ్ బూత్, శాసన సభ, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాడు అన్న వివరాలు సైతం తెలుసుకోవచ్చని వెల్లడించారు. పోలిసంగ్ బూత్ స్థాయి అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో)ల వివరాలను సైతం తెలుసుకోవచ్చని వివరించారు.

# వడివడిగా రైల్వే విద్యుదీకరణ పనులు

**కర్నూలు :**

రైల్వే విద్యుదీకరణ పనులపై రైల్వే శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. దీంతో ఏడాది చివర్లో గద్వాల్ - కర్నూలు సిటీ మధ్య విద్యుదీకరణ పనులను రైల్వే శాఖ పూర్తి చేసింది.దక్షిణమధ్య రైల్వే 2022-2023 ఆర్థిక సంవత్సరం చివరి అంకంలో విద్యుదీకరణకు అధిక ప్రాధాన్యమిస్తూ పనులను వేగవంతం చేసింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మరిన్ని విభాగాలను విద్యుదీకరించిన మార్గాల జాబితాలో చేర్చింది. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గద్వాల్ - కర్నూలు సిటీ మధ్య 54 రూట్ కిమీ దూరం వరకు విద్యుదీకరణ పనులను పూర్తి చేసింది. జోన్ పరిధిలో సికింద్రాబాద్ - ధర్మవరం మధ్య పూర్తిస్థాయిలో విద్యుదీకరించిన రైలు మార్గంలో ఇప్పుడు విద్యుత్ ట్రాక్షన్ ద్వారా రైళ్లను నడిపే వీలు కలిగిందని రైల్వే శాఖ ప్రకటించింది.



విద్యుదీకరణ ప్రాజెక్ట్ లో స్టేషన్లు...గద్వాల్ - కర్నూలు సిటీ స్టేషన్ల మధ్య విద్యుదీకరణ, డోన్ - కర్నూలు సిటీ - మహబూబ్‌నగర్.. సికింద్రాబాద్ - ముద్ఖేడ్ - మన్మాడ్ విద్యుదీకరణ ప్రాజెక్ట్ లో భాగంగా పూర్తి చేశారు. ఈ ప్రాజెక్ట్ 2018 -19 సంవత్సరంలో రూ. 916.07 కోట్ల సవరించిన అంచనా వ్యయంతో పనులు చేపట్టడం జరిగిందని రైల్వే అదికారులు వెల్లడించారు. సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ మధ్య విభాగాన్ని వేరే ప్రాజెక్టులో భాగంగా మంజూరు చేయటం ద్వారా ఇప్పటికే విద్యుదీకరించామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కింద మహబూబ్‌నగర్ - గద్వాల్ ఉ కర్నూలు సిటీ -డోన్ ల విభాగాల మధ్య పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధి లోని డోన్ - గుత్తి - ధర్మవరం మరియు నైరుతి రైల్వే పరిధిలోని ధర్మవరం - బెంగళూరు సిటీ విభాగాల మధ్య విద్యుదీకరణ కూడా పూర్తయింది. అందువల్ల, ప్యాసింజర్ రైళ్లు, గూడ్స్ రైళ్లు రెండూ, ఇప్పుడు హైదరాబాద్ - ధర్మవరం తో పాటుగా, బెంగుళూరు వరకు సజావుగా ప్రయాణించేందుకు వీలుంటుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. రైలు ప్రారంభమయిన స్టేషన్ నుంచి చివరి స్టేషన్ వరకు రైళ్లను ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌త నడిపేందుకు వీలుపడుతుందని అంటున్నారు.ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌తో రైళ్ల రాకపోకల నిర్వహణ వల్ల కార్బన్ వినియోగం తగ్గుతుందని, దీని వలన పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని రైల్వే అదికారులు అంటున్నారు. ఇంజిన్ మార్పిడిని నివారించడం ద్వారా రైళ్ల నిర్వహణలో రైలు ప్రయాణీకులకు ఎలాంటి అంతరాయం లేని రాకపోకలు సాగించేందుకు సహాయపడుతుందని చెబుతున్నారు. ప్రయాణికులు, సరకు రవాణా చేసే రైళ్ల మార్గ మధ్య నిలుపుదలను తగ్గిస్తుందని, రైళ్ల సగటు వేగాన్ని కూడా మెరుగుపరచేందుకు వీలుంటుందని తెలిపారు. విభాగాల మధ్య సామర్థ్యం పెంపుదల కారణంగా ఈ విభాగంలో మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉందని వెల్లడించారు. విద్యుదీకరణ వల్ల రైల్వేలకు ఇంధన ఖర్చులు పెద్ద ఎత్తున ఆదా అవుతుందని, దీంతో పాటుగా కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి సహాయపడతాయని తెలిపారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. విద్యుద్దీకరణ పనులను పూర్తి చేయడంలో అద్భుతమైన పని తీరును కనబరిచటంతో పాటుగా, అంకితభావంతో పనిచేసినందుకు ఎలక్ట్రికల్ విభాగం, అధికారులు, సిబ్బందిని అభినందించారు. గద్వాల్- కర్నూల్ స్టేషన్ల మధ్య ఈ మార్గంలో విద్యుదీకరణ పూర్తవడంతో, సికింద్రాబాద్ - బెంగళూరు మధ్య మొత్తం సెక్షన్‌లో ఎలక్ట్రిక్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు జనరల్ మేనేజర్ తెలిపారు. జోన్ పరిధిలో ఇప్పటికే ఉన్న బ్రాడ్ గేజ్ మార్గాలను 100% విద్యుదీకరణ దిశగా వడివడిగా అడుగులు వేస్తోందని కూడా ఆయన పేర్కొన్నారు.

# చివరి దశకు కేబుల్ బ్రిడ్జి పనులు

**కరీంనగర్ :**

అప్రోచ్ రోడ్డు పనులు చివరి దశకు చేరుకున్నందున కరీంనగర్ కేబుల్ బ్రిడ్జిని ప్రారంభించాలని జిల్లా యంత్రాంగం ఆలోచిస్తోంది. ఏప్రిల్ 14న ఐటీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి కేటీఆర్ దీన్ని ప్రారంభించే అవకాశం ఉంది. అప్రోచ్ రోడ్లు, అండర్‌పాస్ వంతెనలు మినహా ప్రధాన వంతెన పనులు కొంతకాలం క్రితమే పూర్తయ్యాయి. కోర్టు కేసులన్నీ క్లియర్ కావడంతో అధికారులు అప్రోచ్ రోడ్లను పూర్తి చేస్తున్నారు, అది కూడా చివరి దశకు చేరుకుంది. మరోవైపు రూ.8 కోట్లతో వంతెనకు ఏర్పాటు చేస్తున్న డైనమిక్ లైటింగ్ సిస్టమ్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి.మానేర్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా, కరీంనగర్ పట్టణ శివార్లలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని లోయర్ మానేర్ డ్యామ్ (ఎల్ఎమ్‌డి) దిగువ మానేర్ మీదుగా కేబుల్-స్టేడ్ వంతెనను నిర్మిస్తున్నారు. రూ.181 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు 2017 డిసెంబర్ 30న అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శంకుస్థాపన చేశారు. టాటా ప్రాజెక్ట్స్ మరియు టర్కీకి చెందిన గ్లుమార్క్ అనే కంపెనీ ఈ వంతెనను నిర్మిస్తున్నాయి. కరీంనగర్ తీగల వంతెనకు సంబంధించి వివిధ దశల్లో సామర్థ్య పరీక్షలు పూర్తి చేశారు. 2021లోనే వివిధ లోడ్ టెస్టింగ్ చేశారు. వంతెన మొయిన్? స్పాన్‌పై 950 టన్నుల బరువు ఉంచి సామర్థ్య పరీక్ష నిర్వహించారు. వంతెనకు ఇరువైపులా నిర్మాణం చేసిన ఫుట్? పాత్?పై 110 టన్నుల బరువు ఏర్పాటు చేసి పరీక్ష పూర్తి చేశారు.

# శ్రీరామ నవమి సందర్భంగా వివిధ పోటీలు

**నందికొట్కూరు**

నందికొట్కూరు మండలం మల్యాల గ్రామము నందు శ్రీరామ నవమి సందర్భంగా పోటీలు నిర్వహించబడును మల్యాల గ్రామంలో వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు మల్యాల దేవాదాయ శాఖ ధర్మకర్త గోవిందా చారి సర్పంచు ఉమాదేవి సోమవారం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మల్యాల గ్రామంలో ప్రసిద్ధిగాంచిన స్వస్తిశ్రీ శోభకృతు నామ సంవత్సర చైత్రమాస శుద్ధ నవమీ గురువారము అనగా తేది. 30 ఉదయం 11 గంటలకు మల్యాల గ్రామములో వెలసిన సీతారామాంజనేయ స్వామి దేవాలయము నందు శ్రీ సీతారాముల వారి కళ్యాణము జరుగునని గ్రామ ప్రజలు నిశ్చయించినారు. కావున భక్తాదులు విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీసీతారాముల వారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము తెలిపారు. సాయంత్రం 4 గంటలకు దేవుని ఊరేగింపు. రాత్రి 10 గంటలకు జానపద బృందంచే పాటలు ఉండును.31 శుక్రవారం ఉదయం 08:00 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభమగును. అందరికీ బహుమతులు ఇవ్వబడును స్లోసైకిల్ పందెం లను నిర్వహించబడును వారు తెలిపారు. పొట్టేల పందెంలో గెలుపొందిన వారికిప్రథమ బహుమతి 5 తులాలు వెండి ద్వితీయ బహుమతి 3 తులాలు వెండి ఇవ్వబడునని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎలా నాయుడు. శ్రీరాములు గౌడ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

## ఎమ్మెల్యే చిన్నయ్య పై లైంగింక ఆరోపణలు

**మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పై ఓ ప్రయివేటు డైరీ ఫామ్ వ్యాపారి లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిందో మహిళ. సోమవారం ఎమ్మెల్యే చేసిన చాటింగ్ వీడియో వైరల్ అయింది. నేడు లైంగిక వేధింపులంటు ఓ మహిళా ఆడియో విడుదల చేసింది. మమ్మల్ని, మా డబ్బులు వాడుకుని మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేశారు. తప్పుడు కేసులు పెట్టించాడు.. పోలీసులతో వేధింపులకు గురిచేయిస్తున్నారు. ఎమ్మెల్యే, తన మనుషుల నుంచి నాకు ప్రాణహాని ఉందని ఆమె ఆరోపించింది.

## ఈతకు పోయి ఇద్దరు విద్యార్థులు మృతి

**భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిషాల గ్రామంలో విషాదం నెలకొంది. పెద్దవాగులో ఈతకి వెళ్లిన బండారి అఖిల్ (15), ఉర్సుల హర్షవర్ధన్ (15) అనే ఇద్దరు విద్యార్థులు వాగులో మునిగి మృతి చెందారు. మృతులిద్దరూ మొగుళ్లపల్లి లోని కొరకిశాల మోడల్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్నారు.

## నకిలీపాల గుట్టు రట్టు

**యాదాద్రి**



భూధాన్ పోచంపల్లి మండలం కాప్రాయపల్లి గ్రామంలో నకిలీ పాల వ్యాపారాన్ని ఎస్ వోటీ పోలీసులు గుర్తించారు. దాడులు జరిపి కల్తీపాల తయారీదారుడు పిండి జంగయ్య ను అరెస్ట్ చేసారు. 80 లీటర్ల కల్తీ పాలు, 100 మి.లీ హైడ్రోజన్ పెరాక్సైడ్, నకిలీ పాలు తయారు చేసే 3కిలోల స్కిమ్మద్ మిల్క్ పౌడర్ స్వాధీనం చేసుకున్నారు.

## మోడీకి వ్యతిరేకంగా పోస్టర్లు

**మేడ్చల్**

మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో భారత ప్రధాని నరేంద్రమోడీ కి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసాయి. ఉప్పల్ నుండి నారపల్లి వరకూ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ పనులు ఇంకా ఎన్నాళ్ళు అంటూ వెలిసిన పోస్టర్లతో కలకలం రేగింది. ఉప్పల్ నుండి ఘట్ కేసర్ వెళ్ళే వరంగల్ హైవే పై కేంద్ర ప్రభుత్వం నిధులతో 2018 మే 5 ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం అయ్యాయి. అయిదేళ్లు అయినా నలభై శాతం కూడా పూర్తి కాలేదనీ , ఇంకా ఎన్నాళ్ళు కడతారని ప్రశ్నిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోటో తో పోస్టర్లు వెలిపాయి

## దంపతుల ఆత్మహత్య సెల్ఫీ

**గాజువాక**

గాజువాక వడ్లపూడి తిరుమల నగర్ లో భార్యాభర్తలు సెల్ఫీ వీడియోతో ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి అదృశ్యం కావడం సంచలనం రేపింది. వారిద్దరూ ఆర్థిక ఇబ్బందులు వల్ల ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో తీసి స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. చిత్రాడ వరప్రసాద్ (47), స్టీల్ ప్లాంట్ ఉద్యోగి. భార్య మీరా (41) ఇద్దరూ సెల్ఫీ వీడియో తీసి బంధువులకి కుటుంబ సభ్యులకి పంపించారు. విషయం తెలుసుకున్న కుమారుడు కృష్ణసాయితేజ దువ్వాడ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. అనకాపల్లి కొప్పాక ఏలూరు కాలువ వద్ద చెప్పులు హ్యాండ్ బ్యాగు మొబైల్ ఉన్నట్టు పోలీసలు గుర్తించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసారు.

## రాహుల్ కోసం బంగ్లా ఖాళీ చేసి ఇస్తా

న్యూఢిల్లీ

రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దైన వేళ నెల రోజుల్లోగా బంగ్లాను ఖాళీ చేయాలని లోక్ సభ కమిటీ నోటీసులు జారీ చేసింది. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్త చేశారు. రాహుల్ గాంధీ కోరుకుంటే తన ఇంటికి రావాలని, ఆయన కోసం తన బంగ్లాను ఖాళీ చేస్తానని ప్రకటించారు. రాహుల్ గాంధీ బంగ్లాను ఖాళీ చేస్తే ఆయన తన తల్లితో కలిసి ఉంటారని, లేదంటే తనతో కలిసి ఉండొచ్చని, ఆయన కోసం బంగ్లాను ఖాళీ చేస్తానని చెప్పారు ఖర్గే. రాహుల్‌ను బెదిరించడం, అవమానించడం వంటి వైఖరిని ఖండిస్తున్నావన్నారు ఖర్గే. ఈ పద్ధతి మంచిది కాదన్నారు. “కొన్నిసార్లు మేము 3-4 నెలలు బంగ్లా లేకుండా ఉంటున్నాం. 6 నెలల తర్వాత నాకు బంగ్లా దొరికింది. వీళ్లు తమ వారిని కించపరిచేందుకే ఇలా చేస్తున్నారు. అటువంటి వైఖరిని నేను ఖండిస్తున్నాను. గత వారం రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వానికి అనర్హత వేటు పడిన తర్వాత లోక్ సభ గృహనిర్మాణ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత 12 తుగ్లక్ లేన్‌లోని అధికారిక బంగ్లాను ఖాళీ చేయాలని లోక్ సభ సెక్రటేరియట్ కాంగ్రెస్ నేత రాహుల్‌కు లేఖ రాసింది. అనర్హత వేటు పడిన సభ్యుడు తన సభ్యత్వాన్ని కోల్పోయిన నెల రోజుల్లోగా ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గడువు పొడిగించాలని హౌసింగ్ కమిటీని రాహుల్ గాంధీ కోరే అవకాశం ఉందని మరో అధికారి తెలిపారు.

# శ్రీనగర్ రోడ్డు పునరుద్ధరణ

**శ్రీనగర్ :**

శ్రీనగర్ నుంచి లడఖ్ వరకు హిమపాతం కారణంగా నిలిచిపోయిన రాకపోకలు రికార్డు సమయంలో పునరుద్ధరించారు. పొరుగుదేశాల వ్యూహాత్మక ఎత్తుగడలను నిలువరించేలా సైన్యం రాకపోకలకు వీలుగా మూడు రహదారులు అందుబాటులోకి వచ్చాయి. శ్రీనగర్, మనాలి మీదుగా లడఖ్ వరకు వాహనాల రాకపోకలను బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ రికార్డు సమయంలో పునరుద్ధరించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ సొరంగం యొక్క ప్రయోజనాన్ని అందిపుచ్చుకుంటూ వ్యూహాత్మక ప్రాంతాలకు అన్నిరకాల వాతావరణాల్లోనూ రాకపోకలు సాగించేందుకు వీలుగా మరో రెండు పర్వతాల గుండా సొరంగం నిర్మాణానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. 39 కి.మీ పొడవైన శ్రీనగర్ మార్గం మార్చి 26వ తేదీన పునః ప్రారంభమైంది. శ్రీనగర్ నుంచి 100 కి.మీ దూరంలో సముద్ర మట్టానికి 11,540 అడుగుల ఎత్తులో ఉన్న జోజి లా మార్గం జనవరి 6వ తేదీన భారీ హిమపాతం కారణంగా మూసివేసిన 68 రోజుల తర్వాత తెరుచుకుంది. అటల్ సొరంగం ద్వారా 427 కి.మీ మనాలి - లేహ్ రహదారి 138 రోజుల తర్వాత శనివారం తిరిగి అందుబాటులోకి వచ్చింది. మే/ జూన్ నెలల్లో ఈ రహదారి పునఃప్రారంభమవుతుందని భావించినా అంతకుముందే అందుబాటులోకి రావడం విశేషం. నిమ్ము-పదమ్-దర్చా (ఔఖఅ) రహదారిపై సముద్ర మట్టానికి 16,561 అడుగుల ఎత్తులోని షింకు లా మార్గం 55 రోజుల విరామం తర్వాత గురువారం ప్రారంభమైంది. ఈ రహదారిని లడఖ్‌కు మూడవ మార్గంగా నిర్మిస్తున్నారు, అయితే ఇంకా పూర్తి స్థాయిలో రహదారి నిర్మాణం పూర్తికాలేదు. జోజిలా అనేది కాశ్మీర్ లోయ - లడఖ్ మధ్య కీలకమైన లింక్‌ను అందించే వ్యూహాత్మక మార్గం. ఇది సాయుధ దళాల కార్యాచరణ సంసిద్ధతకు కీలకమైనది. విపరీతమైన హిమపాతం కారణంగా ఇది దాదాపు ఆరు నెలల పాటు మూసివేయబడింది. అయితే, గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే, ఈ సంవత్సరం 68 రోజుల రికార్డు సమయంలోనే ఃఖీా దీన్ని తిరిగి తెరిచింది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ చౌదరి 11,650 అడుగుల ఎత్తులో ఉన్న జోజిలా పాస్ వద్ద ట్రాఫిక్ కోసం రహదారిని ప్రారంభించారు2020 మేలో గాల్వాన్ సరిహద్దులో చైనా సైన్యంతో ఘర్షణలు జరిగినప్పటి నుంచి ఈ ప్రాంతంలో సాధారణం కంటే అధిక సంఖ్యలో మన సైనికులు మోహరించారు. ఈ నేపథ్యంలో అనుకున్న సమయానికి ముందే రహదారులు పునరుద్దరించడంతో 3 నుంచి 4 నెలలు సైన్యం ఒకే ప్రాంతంలో ఉండిపోకుండా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వీలుంటుంది. ఈ రహదారులు అందుబాటులోకి రావడం వల్ల పౌరులు, ఇతర సరకు రవాణా కోసం విమాన ప్రయాణానికి ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. రహదారులు పునఃప్రారంభం కావడంతో స్వస్థలాలకు వెళ్లే కశ్మీరీలు, అక్కడి అందాలు తిలకించేందుకు వచ్చే అతిథులకు విమానయానంతో పోలిస్తే తక్కువ ఖర్చుతో చౌకైన ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. మార్గాల్లో మంచును తొలగించడం ద్వారా బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ సామర్థ్యం వెలుగుచూసింది. జోజి లా, షింకు లా రెండు సొరంగ మార్గాల ఏర్పాటు ద్వారా ఈ రహదారులను సమర్థంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటి ద్వారా లడఖ్‌కు అన్ని కాలాల్లోనూ రాకపోకలను కొనసాగించాలని భావిస్తోంది. ఈ నిర్ణయం దేశ రక్షణకు సైనిక సన్నద్ధతతో పాటు, ఈ ప్రాంత ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతుంది. మనాలి-లేహ్ మార్గంలో చలికాలంలో హిమపాతం సంభవించే నాలుగు ఇరుకైన దారులు, శీతల గాలుల కారణంగా విపరీతమైన చలి నుంచి ప్రయాణికులకు రక్షణ కల్పించడంతో పాటు రాకపోకలకు షింకు లా మార్గం అనువుగా ఉంటుంది.

# మరో వివాదంలో హెల్త్ డైరక్టర్

**ఖమ్మం:**

వివాదాలు ఆయన వెంట పడతాయో.. వివాదాల వెంట ఆయన పడతారో చెప్పలేం కానీ తెలంగాణ హైల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ మాత్రం నిత్యం వివాదాలతో వార్తలలో ఉంటారు. గతంలో ఒక సారి శ్రీనివాస్ రావు ఏసుక్రీస్తు దయతోనే దేశంలో కరోనా కేసులు తగ్గాయనీ, కరోనా నుంచి విముక్తి చెందామనీ చేసిన వ్యాఖ్యలు వ్యాఖ్యలు వివాదాస్పద మయ్యాయి. ఆయన అలా అని ఊరుకోలేదు. క్రైస్తవం వల్లే దేశం అభివృద్ధి చెందిందన్నారు. ఆఫ్కోర్స్ అది ఆయన వ్యక్తి గత విశ్వాసం కావచ్చును. కానీ, ఆయన ఒక అధికారి, ఆవిషయం మరిచి పోయి చేసిన వ్యాఖ్య సహజంగానే అప్పట్లో దుమారం రేపింది. గత ఏడాది డిసెంబర్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో శ్రీనివాసరావు ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఆయన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. అంతే కాదు ప్రపంచానికి, అభివృద్ధి పాఠాలు నేర్పిందే క్రైస్తవ మతమని, ప్రపంచం అభివృద్ధి



చెందడానికి క్రైస్తవులే కారణమని కూడా అన్నారు. అదే జోరులో క్రైస్తవ మత ప్రచారానికి నడుంబిగించాలని కూడా సూచించారు. నిజమే అప్పట్లో హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస రావు సెమీ క్రిస్మస్ వేడుకలలో తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అది కూడా వ్యక్తిగత హోదాలో హాజరైన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ పోస్టులో ఉన్న ఆయన, తన విధుల్లో భాగమైన కరోనా మహమ్మారి కట్టడి జీసస్ క్రైస్ట్ దయవల్లే జరిగిందని చెప్పడం విమర్శలకు తావిచ్చింది. నిజానికి శ్రీనివాసరావు మత విశ్వాసాల గురించి పెద్దగా తెలియక పోయినా ఆయన రాజకీయ ఆశలు, ఆకాంక్షల గురించి మాత్రం ఆయన తన చేష్టల ద్వారా అందరికీ తెలిసేలా వ్యవహరిస్తుండటంకద్దు. గతంలోనూ ఆయన పబ్లిక్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ కాళ్లు మొక్కి, వివాదాస్పద అధికారిగా వార్తల్లోకి ఎక్కారు. అదొక వివాదం అయితే కరోనా నుంచి విముక్తి పొందడానికి ఏసుక్రీస్తు దయే కారణమంటూ చేసిన వ్యాఖ్యలు మరో వివాదం. ఆయన వ్యాఖ్యలపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొన్నారు. అది సర్దుమణిగిందనుకునే లోగానే.. తాజాగా అయన రాష్ట్రంలో ఆదర్శవంతమైన ఎమ్మెల్యే అంటూ ఎవరైనా ఉంటే అది మంత్రి హరీష్ రావేనని అన్నారు. కొత్తగూడెంలో పర్యటించిన సందర్భంగా హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఒక విధమైన తన్మయత్వంతో మంత్రి హరీష్ పై ప్రశంసల వర్షం కురిపించారు. హరీష్ సిద్దిపేటకు చేసిన దానిలో సగంపనులు చేసిన కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దుమారం రేపుతున్నాయి. ప్రభుత్వోద్యోగా, బీఆర్ఎస్ కార్యకర్తా అంటూ సామాజిక మాధ్యమంలో నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.

# మహిళా జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

**హైదరాబాద్ :**

అక్రిడిటేటేడ్ మహిళా జర్నలిస్టులకు ఈ నెల 29 నుండి పది రోజుల పాటు ఉచిత వైద్య శిభిరం నిర్వహించనున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళా జర్నలిస్టులకు పురస్కార కార్యక్రమంలో మహిళా జర్నలిస్టులు ఉచిత వైద్య శిభిరం నిర్వహించాల్సిందిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.టి.రామారావుకి విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తి కి మంత్రి సానుకూలంగా స్పందించిన మేరకు ఈ నెల 29 తేది నుండి మాసాబ్ ట్యాంక్ లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ఈ కాంప్రహెన్సివ్ హెల్త్ చెకప్ లో రక్త పరీక్ష , బ్లడ్ షుగర్, దయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బి12, డి3 మొదలైన డయాగ్నోస్టిక్స్ పరీక్షలు , ఇఅఉ, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్ స్మియర్, స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, కంటి స్క్రీనింగ్ , దంత పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు మొదలైన పరీక్షలు చేయనున్నారు. ఈ పరీక్షల రిపోర్ట్ లు అదే రోజు అందజేయనున్నారు. ఈ ఉచిత వైద్య శిభిరాన్ని ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నిర్వహించనున్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ఈ శిభిరంలో రాష్ట్ర స్థాయి అక్రిడిటేటేడ్ మహిళా జర్నలిస్టులతో పాటు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుండి అక్రిడిటేషన్ పొందిన మహిళా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు. జిల్లాలకు చెందిన అక్రిడిటేటేడ్ మహిళా జర్నలిస్టులకు ఆయా జిల్లా కేంద్రాలలో ఉచిత వైద్య శిభిరాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# బలగం నటులను అభినందించిన మంత్రి ఎర్రబెల్లి

**హైదరాబాద్**

తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో రూపొందించి, విజయవంతంగా నడుస్తున్న బలగం సినిమా నటులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభినందించారు. బలగం సినిమాలో కొమురయ్య తమ్ముడు అంజయ్య పాత్రలో నటించి బాగా పేరు తెచ్చుకున్న రాయపర్తి కి చెందిన గుడి బోయిన బాబుని మంత్రి సత్కరించారు. అలాగే ఈ సినిమాలో నటించిన కర్తానందం, వేముల ప్రభాకర్ లను కూడా మంత్రి సన్మానించారు. కాగా గుడి బోయిన బాబుది వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండల కేంద్రం. ఎన్నో చైతన్య నాటకాలలో నటించిన బాబు బలగం సినిమాలో ఉదాత్తమైన పాత్రను పోషించారు. తండ్రి చనిపోతే పాతి పెట్టడానికి ఆరడుగుల స్థలం కూడా లేని స్థితిలో పంచాయతీ పెట్టుకుంటున్న కొడుకుల పరిస్థితిని చూసి జాలిపడిన బాబాయి పాత్రలో బాబు బాగా రాణించారు. అని మంత్రి ఎర్రబెల్లి బాబుని అభినందించారు

## కవితకు మరోసారి ఈడీ పిలుపు

**న్యూఢిల్లీ**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ నుంచి మరోసారి పిలుపు అందింది. మంగళవారం ఢిల్లీ కార్యాలయానికి రావాలని కోరింది. ఈడీ పిలుపుపై స్పందించిన కవిత.. ప్రతిగా తన లీగల్ అడ్వైజర్ను పంపించారు. కాగా మార్చి 11న ఎమ్మెల్సీ కవితకు చెందిన ఫోన్ను ఈడీ అధికారులు సీజ్ చేసిన విషమం తెలిసిందే. ఈనెల 21న ఎమ్మెల్సీ తన 9ఫోన్లను ఈడీకి అందజేశారు. అయితే సీజ్ చేసిన ఫోన్లను ఓపెన్ చేసేందుకు సాక్షిగా కవిత గానీ, ఆమె ప్రతినిధి గానీ రావాలని ఈడీ అధికారులు కోరారు. ఈ మేరకు లీగల్ అడ్వైజర్ కు ఆథరైజేషన్ ఇచ్చి తన ప్రతినిధిగా ఈడీ కార్యాలయానికి విచారణకు పంపించారు.

ఢిల్లీ లిక్కర్ స్కామ్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ఇప్పటి వరకు మూడుసార్లు ఈడీ విచారణకు హాజరయ్యారు. ఈనెల 11,20,21 తేదీల్లో ఈడీ ముందు విచారణను హజరయ్యారు.

## డిసిఎం లో మంటలు..డ్రైవర్ క్షేమం

**శంషాబాద్**

రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహాడ్ చౌరస్తా వద్ద డీసీఎం లో మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తూ డ్రైవర్ కు ప్రమాదం తృటిలో తప్పింది. హైదరాబాద్ నగర శివారు హయత్ నగర్ కు చెందిన డీసీఎం గగన్ పహాడ్ పారిశ్రామిక వాడ లోని ప్లాస్టిక్ కుర్చీల కంపెనీలో కుర్చీలను లోడ్ చేసుకొని చెన్నైకి వెళ్తుంది.

కంపెనీ నుండి మెయిన్ రోడ్ పైకి రాగానే డిసిఎం క్యాబిన్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన డ్రైవర్ డీసీఎం లో ఉన్న నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు. కానీ మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో డీసీఎం తో పాటు అందులో ఉన్న ప్లాస్టిక్ కుర్చీలు సైతం అగ్నికి అహుతయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అర్పివేశారు. జాతీయ రహదారిపై గగన్ పహాడ్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎయిర్పోర్ట్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

## మంత్రిని అడ్డుకున్న గౌడ సంఘం సభ్యులు

**మేడ్చల్**

మేడ్చల్ జిల్లా బోడుప్పల్, పీర్జాదిగూడ ఘట్ కేసర్, పోచారం మున్సిపాలిటీ లలో ప్రభుత్వ స్థలాలలో జీవో నంబరు 58 కింద ఇండ్ల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు మంత్రి మల్లారెడ్డి మంగళవారం పంపిణీ చేసారు. మేడిపల్లి మండలం భగత్ సింగ్ కాలనీలో పట్టాలు పంపిణీ ని గౌడ సంఘం సభ్యులు అడ్డుకున్నారు. భగత్ సింగ్ కాలనిలో యాభై ఏళ్లక్రితమే గౌడ సంఘనికి ఐదు ఎకరాలు ప్రభుత్వం కేటాయించందని ఇప్పుడెలా వారికి పట్టాలు ఇస్తారని మంత్రి మల్లారెడ్డి ని గౌడ సంఘం నాయకులు నిలదీసారు.

## ఎమ్మెల్యేపై టీడీపీ నేత ఫిర్యాదు

**మచిలీపట్నం**

తనను చంపుతానని ఎమ్మెల్యే కైలె అనిల్ కుమార్ అనుచరులు బెదిరిస్తున్నారని ఎస్పి కు పామర్రు టిడిపి ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా పిర్యాదు చేసారు. పామర్రు నియోజకవర్గంలో లోపించిన శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరుతూ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా జిల్లా ఎస్పీ జాషువాను కోరారు. అడ్డాడ గ్రామంలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అనుచరులు గ్రామ చెరువులో మట్టిని అక్రమంగా దోచుకునేందుకు దేవత విగ్రహాన్ని సైతం పక్కకు తొలగించారని ఆరోపించారు. దేవత విగ్రహం విషయంలో అపచారానికి పాల్పడటం, అక్రమంగా మట్టిని కాజేయడాన్ని ప్రశ్నించినందుకు తమను చంపేస్తామంటూ ఎమ్మెల్యే అనుచరులు వీడియో మెసేజ్ లు పెట్టి బెదిరిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తున్న ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలను అరికట్టాలని, చెరువు తవ్వకం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టీడీపీ, జనసేనతో కలిసే పోటీచేస్తాం

**గుంటూరు**

రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలతో కలిసి సీపీఐ ఎన్నికల బరిలో నిలవబోతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడించారు. మంగళవారం నాడు అయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. కలవడం అంటూ జరిగితే మా ఓట్లు ఇవ్వడం మాత్రమే కాదు.. మాకు సీట్లు కూడా కావాలని స్పష్టం చేశారు.. ఇక, వీరుడు, సూరుడు అనుకున్న జగన్.. కేంద్రం దగ్గర మొకరిల్లుతున్నాడని విమర్శలు గుప్పించారు.. పోలవరం విషయంలో వాళ్ల నాన్న వైఎస్ లో ఉన్న పోరాట స్ఫూర్తి జగన్ లో కనిపించడం లేదన్న ఆయన.. వాళ్ల నాన్న సిద్ధాంతాలకు కూడా పంగ నామాలు పెట్టిన వ్యక్తి గా జగన్ మిగిలిపోయేలా ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇచ్చినా తీసుకునే తత్వం సీఎం వైఎస్ జగన్ కు లేదని విమర్శించారు నారాయణ.. పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి.. పోలవరం ఎత్తు పెంచడంతో పాటు నిర్వాసితులకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పోలవరం విషయంలో విభజన హామీల హక్కులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుక బడిపోయిందన్నారు.. మీకు, పోరాడటానికి భయంగా ఉంటే అఖిల పక్షానికి ఢిల్లీ తీసుకువెళ్ళండి, విభజన హామీలు మేం సాధించుకు వస్తాం

# కన్నా, రాయపాటి... ఒక్కటవుతున్నారా

**గుంటూరు :**

గుంటూరు తెలుగు దేశం పార్టీ రాజకీయాలు చాలా హాట్‌గా మారాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ గెలుపే లక్ష్యంగా పని చేయాలనే టార్గెట్‌తో ఇరు పార్టీలకు చెందిన నాయకులు దీక్ష తీసుకున్నట్లు కనిపిస్తోంది. దీంతో దశాబ్దాలుగా ఉన్న విభేదాలను సైతం పక్కన పెట్టి అందరిని కలుపుకొని వెళ్ళేందుకు అవసరమైన అన్ని మార్గాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల తెలుగు దేశం పార్టీలో చేరి కన్నా లక్ష్మీనారాయణ, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నాయకులను కలుపుకునే క్రమంలో ప్రత్యేక విందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి గుంటూరు జిల్లాకు చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఇదే సమావేశానికి మాజీ పార్లమెంట్ సభ్యుడు రాయపాటి సాంబశివరావు తనయుడు రాయపాటి శ్రీనివాస్ కూడా రావడం అందర్నీ ఆకట్టుకుంది. ఎప్పటి నుంచో ఈ రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి. కన్నాపై రాయపాటి సాంబశివరావు పరువు నష్టం కేసు కూడా వేశారు. అయితే కోర్టులో ఇరువురు నేతలు రాజీపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇరువురు నేతలు పోటాపోటీగా రాజకీయాలు నడిపించారు. ఆ క్రమంలో ఇరువురి గ్రూపులు కూడా ఉన్నాయి. రాజకీయంగా ఘర్షణలకు కూడా జరిగాయి. ఒకరిపై ఒకరు కేసులు బనాయించుకోవటం, ఆందోళనలు చేయటం వంటి ఘటనలు గుంటూరు రాజకీయాల్లో షరామామూలుగా సాగుతూ వచ్చాయి. వీళ్లిద్దరూ కాంగ్రెస్ పార్టీలో ఉండేవాళ్లు. విభేదాలు కూడా అదే స్థాయిలో ఉండేవి.



తర్వాత మారిన రాజకీయ పరిస్థితులు కారణంగా ఇద్దరూ కాంగ్రెస్ పార్టీని వీడారు. రాయపాటి టీడీపీలో చేరితే... కన్నా లక్ష్మీనారాయణ బీజేపీలో చేరారు. అక్కడ నుంచి తెలుగు దేశం పార్టీ కండువా కప్పుకోవటం జరిగింది. దీంతో ఇప్పుడు మరోసారి ఒకే పార్టీలోకి వచ్చిన కన్నా, రాయపాటి కుటుంబాల మధ్య సంబంధాలు ఎలా ఉంటాయనే ఉత్కంఠ నడిచింది. ఒకే పార్టీలో ఉంటూ తరచూ తిటుకునే వాళ్లు ఇప్పుడు టీడీపీలో ఎలా ఉంటారనే చర్చ కూడా సాగింది. అనూహ్యంగా రెండు వర్గాలు కలిసి విందు భేటీలో పాల్గొనడం గంటూరు రాజకీయాల్లో ఇదో ట్విస్ట్ అంటున్నారు స్థానికులు. ఇద్దరూ కలసి రాజకీయం చేయాలని నిర్ణయించారట కూడా. అందులో భాగంగానే కన్నా లక్ష్మీనారాయణ నిర్వహించిన సమావేశానికి రాయపాటి శ్రీనివాస్ హాజరయ్యారు. శ్రీనివాస్ గతంలో గుంటూరు మేయర్‌గా ఎమ్మెల్సీగా కూడా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కీలకంగా ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో అధికారం దక్కించుకోవటమే ధ్యేయంగా తెలుగు దేశం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే కన్నా లక్ష్మి నారాయణ వంటి కీలక నేతలను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ తరువాత నుంచి పార్టీలో కార్యకలాపాలు కూడా దూకుడు పెంచింది. పార్టీలోని నాయకులను యాక్టివ్ చేయటం,కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళ్ళటం వంటి వ్యూహాత్మకమైన ఎత్తుగడలు వేస్తోంది. అందులో భాగంగానే సీనియర్ నేత అయిన కన్నా లక్ష్మినారాయణకు చంద్రబాబు ఆ బాధ్యతలను అప్పగించారనే ప్రచారం జరుగుతుంది. చంద్రబాబు ఇచ్చిన పవర్‌తో కన్నా ఫుల్ టైం పాలిటిక్స్‌ను గుంటూరు కేంద్రంగా నిర్వర్తిస్తున్నారు. ముందు గుంటూరు జిల్లాలో తెలుగు దేశం పార్టీకి చెందిన క్యాడర్ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం కన్నా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో కూడా కార్యకలాపాలపై ఆరా తీస్తున్నారు. పొలిటికల్‌గా అన్ని జిల్లాల్లో కూడా కన్నాకు ఫాలోయింగ్ ఉన్నందున వాటిని తెలుగు దేశానికి అవసరమైన రీతిలో ఉపయోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని టాక్. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 అసెంబ్లి నియోజకవర్గాలు, మూడు పార్లమెంట్ స్థానాలను దక్కించుకోవటమే ప్రధాన లక్ష్యంగా తెలుగు దేశం నేలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని,అందులో కన్నా లక్ష్మినారాయణ కీలకంగా వ్యవహరిస్తారని అంటున్నారు. ఈ వ్యూహంలో భాగంగానే వైరి వర్గాన్ని కూడా కలుపుకొని వెళ్లేందుకు వెనుకాడటం లేదన్నది పార్టీ వర్గాలు చెబుతున్నా మాట.

# నమీబియా చిరుత మృతి

**భోపాల్ :**

నమిబియా నుంచి తీసుకొచ్చిన ఎనిమిది చిరుతల్లో ఒకటైన సాశా పేరు గల ఆడ చిరుత కన్నుమూసింది. ఈ చిరుత మరణానికి కిడ్నీ సమస్య, డీహైడ్రేషన్ కారణమని అటవీ అధికారులు గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగా చిరుత సోమవారం ఉదయం మృతి చెందింది. అంతకుముందు జనవరిలో సాశా అస్వస్థతకు గురై చికిత్స పొందింది. అప్పట్లో వైద్యులు, భోపాల్‌కు చెందిన వెటర్నరీ నిపుణుల బృందం పరిశీలనలో సాశా ఉంది. సెప్టెంబరు 17, 2022న తన పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోదీ, మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాలోని కునో నేషనల్ పార్క్‌లో నమిబియా నుంచి తీసుకొచ్చిన మూడు ఆడ చిరుతలతో సహా ఎనిమిది చిరుతలను విడుదల చేశారు. “నమిబియా నుంచి తీసుకొచ్చిన ఎనిమిది చిరుతలను రోజూ పర్యవేక్షిస్తున్నారు. ఈ సమయంలో ఆడ చిరుత సాశా బలహీనంగా ఉందని గుర్తించాం. సాశాను వైద్యులు పరిశీలించి, ఆహారం అందించారు. అది బలహీనంగా ఉందని, మరింత వైద్యం అవసరమని భావించి మరిన్ని వైద్య పరీక్షలు చేయించాం” అని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌ఓ) ప్రకాష్ కుమార్ వర్మ తెలిపారు. చిరుత సాశాకు వైద్య పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో చిరుతకు డీహైడ్రేషన్ తో పాటు కిడ్నీ సమస్య ఉన్నట్లు గుర్తించారు వైద్యులు. భోపాల్ నుంచి వైద్యుల బృందాన్ని పిలిపించి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. సాశా అస్వస్థతకు గురైందనే వార్త తర్వాత, భోపాల్‌లోని వాన్ విహార్ నేషనల్ పార్క్ నుంచి వైద్యుల బృందాన్ని వాన్ విహార్ నేషనల్ పార్క్ హెడ్ వెటర్నరీ డాక్టర్ అతుల్ గుప్తా , అతని అసోసియేట్ డాక్టర్ల బృందం కునో పార్క్‌కు పిలిపించారు అధికారులు. జనవరి 22వ తేదీన చీతా ‘సాశా’ అస్వస్థతతో కనిపించింది. దీంతో వైద్య పరీక్షల కోసం క్వారంటైన్‌లోకి తరలించారు కునో నేషనల్ పార్క్ నిర్వాహకులు. రక్త పరీక్షలతోపాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో చిరుతకు మూత్రపిండాల సమస్య ఉన్నట్లు తేలింది. సాశా ఆరోగ్య చరిత్రను పూర్తిస్థాయిలో విశ్లేషిస్తే భారత్‌కు తీసుకొచ్చే ముందే ఈ సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. స్థానిక వైద్యులతోపాటు నమిబియా, దక్షిణాఫ్రికాలకు చెందిన నిపుణుల పర్యవేక్షణలో సాశాకు వైద్యసేవలు అందించారు. అయితే ఆరోగ్య విషమించి సోమవారం చీతా మరణించిందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల నమిబియా నుంచి 4- 6 ఏళ్ల వయసు గల ఐదు ఆడ, మూడు మగ మొత్తం ఎనిమిది చిరుతలను దేశానికి తీసుకువచ్చారు. మరో ఏడు చీతాల్లో మూడు మగ, ఒక ఆడ చిరుత ప్రస్తుతం కునో జాతీయ పార్కులో సంచరిస్తున్నాయి. మిగతా ఏడు చీతాలు ఆరోగ్యంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇటీవల దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన 12 చిరుతలు క్వారంటైన్‌లో ఆరోగ్యంగా ఉన్నాయని కునో అధికారులు ప్రకటించారు.

# వైసీపీలో ఇంకా అసమ్మతి నేతలు...?

**విజయవాడ:**

వైసీపీలో ఏం జరుగుతోంది? ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిపై పార్టీలో ఎలాంటి చర్చ జరుగుతోంది? అధినాయకత్వం ఆలోచనలు ఎలా ఉన్నాయి? ఎమ్మెల్యేలు ఏం ఆలోచిస్తున్నారు? ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారనే నెపంతో ఏకపక్షంగా నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, పార్టీ క్యాడర్ ఎలా చూస్తున్నారు? మరీ ముఖ్యంగా రాష్ట్ర భవిష్యత్ గురించి ప్రజల ఆలోచనలు ఎలా ఉన్నాయి? ఈ ప్రశ్నలన్నిటికీ సామాన్య ప్రజల నుంచి మేథావుల వరకు అందరూ అందరి నోటా వ్యక్తమౌతున్న ఎకాభిప్రాయం ‘రోజులు దగ్గర పడ్డాయి’ పట్టభద్రుల నియోజక వర్గాల్లో వైకాపా ఓటమి, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తే, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలలో ఉన్న సొంత పార్టీపైనా, ప్రభుత్వంపైనా ఉన్న అసంతృప్తిని బహిర్గతం చేసిందని అంటున్నారు. ముఖ్యంగా, వైకాపా ఎమ్మెల్యేలో అసమ్మతి కొత్త వవిషయం కాదు. చాలా కాలంగా చాలా మంది ఎమ్మెల్యేలో అసమ్మతి అగ్గి రాగులు తూనే వుంది. భగ్గు మనేందుకు సిద్ధంగా వుంది. అయితే ఇంతకాలం పిల్లి మేడలో గంట కట్టేదేవరనే దగ్గర ఆగిన అసమ్మతి లావా ప్రవాహానికి స్వయంగా పార్టీ అధినాయకత్వమే గేట్లు ఎత్తేసింది. పొమ్మన కుండా పొగ పెట్టి ఆనం రామ నారాయణ రెడ్డి, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిని బయటకు పంపిన పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి క్రాస్ వోటింగ్ సాకు చూపి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డితో పాటు మహిళా ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ఇక అసమ్మతి కట్టలు తెంచుకుంటుందన్న పార్టీ లో చర్చ మొదలైంది. వైసీపీలో చాలా మంది ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారని సస్పెన్షన్‌కు గురైన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే బయటికి వస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీలో చాలా మంది లోలోపల ఉడికిపోతున్నారని చెప్పారు. మరో పార్టీలో చేరిక కోసం చాలా మంది ఎమ్మెల్యేలు ఆలోచిస్తున్నారని వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికలలో ఎవరికి ఓటేయాలన్న విషయంలో రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే కోటంరెడ్డి వెల్లడించారు. వచ్చే ఎన్నికల తరువాత రాష్ట్ర రాజకీయాల నుంచి వైసీపీ శాశ్వతంగా డిస్మిస్( సస్పెండ్) అవుతుందని జోస్యం చెప్పారు. 2024లో రాజకీయ ప్రజా సునామీ రాబోతోందని.. నిన్నటి పట్టభద్రుల ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమే స్పష్టమైన ప్రజా తీర్పు అని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలనే తపన ఉన్న తాను.. విసిగి వేసారి చివరికి గట్టిగా మాట్లాడానని ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. చివరికి పార్టీ (వైసీపీ)కి విధేయుడిగా ఉన్న తనపైనే నిఘా పెట్టారన్నారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే అనుమానించారని.. పరిష్కరించకుండా రాజకీయ కోణంలో ఆలోచించారని చెప్పారు. అదలా ఉంటే, కడప మొదలు ప్రతి జిల్లాలోనూ, వైకాపా ఎమ్మెల్యేలు, నాయకులు,కార్యకర్తలు జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా నిట్టనిలువుగా చీలిపోయారని అంటున్నారు. అక్కడక్కడా రహస్య సమావేశాలు జరుగుతున్న సమాచారం కూడా పార్టీ పెద్దలకు చేరుతోందని అంటున్నారు. అందుకే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల ప్రతి కదలిక పైనా ఒకరికి తెలియకుండా మరొకరిని నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.దీంతో పార్టీలో ఒకరిని ఒకరు నమ్మే పరిస్థితి లేకుండా పోయిందని, చివరకు మంత్రులు కూడా రాజకీయాల గురించి మాట్లాడేందుకు జంకుతున్నారని అంటున్నారు. ఈ పరిణామాలను గమనిస్తే నిజంగానే కోటంరెడ్డి అన్నట్లుగా వైసీపీని అసమ్మతి సునామీ ముంచేసేలా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# ధర్మపురి ఫ్యామిలీ పాలిట్రిక్స్

**నిజామాబాద్ :**

రాజకీయాలు అంతే. కుటుంబాల్లోనూ చిచ్చు పెడుతాయి. చేరికలు ధర్మపురి శ్రీనివాస్ ఇంట్లో చిచ్చు రేపాయనే చెప్పాలి. సీనియర్ కాంగ్రెస్ నేత ధర్మపురి శ్రీనివాస్ ఇంట్లో ఇలాంటి వివాదమే చోటు చేసుకుంది. ధర్మపురి శ్రీనివాస్ పెద్దకుమారుడు, మాజీ మేయర్ సంజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఆయనను నేరుగా కాంగ్రెస్‌లో చేర్చకుండా తానే వీల్ ఛెయిర్‌లో వచ్చి కాంగ్రెస్ పార్టీ కండువాను ధర్మపురి శ్రీనివాస్ కప్పుకున్నారు. సంజయ్ రాజకీయ భవిష్యత్ కోసమే డిఎస్ గాంధీభవన్ కు వచ్చి మరీ పార్టీలో చేరారు. ఆరోగ్యం సహకరిం చకపోయినా తాను ఓపిక చేసుకుని మరీ తండ్రిగా ఒక కొడుకు కోసం గాంధీభవన్ గడప తొక్కారు. ఇటీవల ధర్మపురి శ్రీనివాస్ అనా రోగ్యం పాలయ్యారు. ఆయన మాట కూడా సరిగా మాట్లాడలేకపోతున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేతలతో సంప్రదించి తొలుత సంజయ్‌ను పార్టీలో చేర్చాలనుకున్నారు. ఈ మేరకు ఆయన ప్రకటన కూడా జారీ చేశారు. అయితే కొద్దిసేపటికే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. సంజయ్ తో పాటు నిన్న గాంధీభవన్ కు వచ్చిన ధర్మపురి శ్రీనివాస్ తన సొంత ఇంటికి వచ్చానని తెలిపారు. నిజామాబాద్ జిల్లాకాంగ్రెస్ నేతలకు కూడా చివరి నిమిషంలో డీఎస్ చేరిక సమాచారాన్ని అందించారు. అయితే ఈరోజు ధర్మపురి శ్రీనివాస్ భార్య ఒక వీడియోను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీకి ధర్మపురి శ్రీనివాస్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వీడియోలో డీఎస్ రాజీనామా లేఖ రాస్తున్నది కూడా కనపడుతుంది. అయితే ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని, పక్షవాతం కూడా వచ్చిందని తమ ఇంటి వైపు కాంగ్రెస్ నేతలు ఎవరూ రావద్దంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. నిన్న కాంగ్రెస్ పార్టీనేతలు పెట్టిన వత్తిడికి ఫిట్స్ కూడా వచ్చాయని ఆయన ఆరోపించారు. డీఎస్ రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. అయితే ధర్మపురి శ్రీనివాస్ రాజీనామా లేఖ, తల్లి వీడియోను నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ చేయించిందేనంటూ సంజయ్ విమర్శించారు. అరవింద్ తమ అమ్మా నాన్నలపై వత్తిడి తెస్తున్నారన్నారు. అవకాశమిస్తే తాను అరవింద్‌పై పోటీ చే?యడానికి సిద్ధమని సవాల్ విసిరారు. అరవింద్ తన తండ్రి ధర్మపురి శ్రీనివాస్‌ను బ్లాక్ మెయిల్ కు గురి చేస్తున్నారని సంజయ్ ఆరోపిస్తున్నారు. మొత్తం మీద ధర్మపురి శ్రీనివాస్ కుటుంబంలో చేరికల చిచ్చు వీధిన పడిందనే చెప్పాలి. పెద్ద కొడుకు కోసం తండ్రి ధర్మపురి శ్రీనివాస్, చిన్న కొడుకు కోసం తల్లి ఇద్దరూ ప్రయత్నిస్తుండటమే ఈ విభేదాలకు కారణం.

# ఆత్మకూరు నుంచే ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు :**

ఆనం రామనారాయణరెడ్డి పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఇక ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడం దాదాపు ఖాయమయింది. మరోసారి ఆయన పసుపు కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత టీడీపీలో చేరిన ఆనం పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో వైసీపీలో చేరి వెంకటగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కానీ అక్కడ మంత్రి పదవి దక్కలేదు.మరోసారి పోటీ చేసి నెగ్గి నెల్లూరు రాజకీయాల్లో ఆనం కుటుంబం ట్రాక్ రికార్డును మళ్లీ లైన్ లోకి తేవాలనుకుంటున్నారు. ఆయనకు అచ్చి వచ్చిన నియోజకవర్గం ఆత్మకూరు. అక్కడ అయితే సునాయాసంగా విజయం సాధిస్తానన్న ధీమాను ఆనం తన సన్నిహితుల వద్ద వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అందుకే ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరి నుంచి ఆత్మకూరుకు ఈసారి మారిపోక తప్పదు. వెంకటగిరిలో పోటీ చేసి టెన్షన్ పడే కన్నా తనకు పట్టున్న నియోజకవర్గం ఆత్మకూరు అయితేనే బెటర్ అని ఆనం భావిస్తున్నారని తెలిసింది.ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అగ్రనేతతో టచ్ లోకి వెళ్లిన ఆనం రామనారాయణరెడ్డి త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నారు. అంతకు ముందుగానే ఆత్మకూరు టిక్కెట్ ను కన్ఫర్మ్ చేసుకున్నారన్న టాక్ కూడా సింహపురిలో వినిపిస్తుంది. ఆత్మకూరు అయితేనే తాను మేకపాటి కుటుంబాన్ని ఎదుర్కొనగలనని కూడా ఆనం చెప్పినట్లు తెలిసింది. నెల్లూరు టీడీపీలో మరొక నియోజకవర్గం కూడా వేకెంట్ గా లేకపోవడం ఆనంకు కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ఆత్మకూరు ఇప్పటికే ఉన్న తన పరిచయాలు, క్యాడర్ ను కూడా ఆనం రెడీ చేసినట్లు చెబుతున్నారు. 2009లో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. మంత్రిగా ఆ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు కూడా. తనకు వ్యక్తిగత ఓటు బ్యాంకు కూడా ఉందని ఆనం విశ్వసిస్తున్నారు. టీడీపీకి కూడా సరైన అభ్యర్థి లేరు. ప్రతి ఎన్నికకు అభ్యర్థులను మార్చి మార్చి పోటీ చేయిస్తుండటం కూడా ఆ పార్టీకి కలసి రావడం లేదు. అయితే టీడీపీకి చెందిన బలమైన సామాజికవర్గం కూడా ఆత్మకూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉంది. అయినా ఆత్మకూరులో ఒకే ఒక్కసారి టీడీపీ గెలిచింది. 1994లో టీడీపీ నుంచి కొమ్మి లక్ష్మయ్య



నాయుడు విజయం సాధించారు. ఆ తర్వాత ఇక్కడ గెలుపు అనేదే లేదు. అందుకే 2019 ఎన్నికల్లో బొల్లినేని కృష్ణయ్యను నిలబెట్టారు. 2014లో మురళి కన్నబాబును పోటీకి దింపారు. ఇలా మారుస్తుండటంతో టీడీపీకి సరైన అభ్యర్థి లేరు. అక్కడ అయితే ఆనం రామనారాయణరెడ్డి తనకు తిరుగుండదని భావిస్తున్నారు పైగా రెండు, మూడు సార్లు మినహాయించి రెడ్డి సామాజికవర్గం నేతలే విజయం సాధించారు. తనపై సస్పెన్షన్ వేయడం సానుభూతిగా మారి తనకు కలసి వస్తుందని భావిస్తున్నారు. మేకపాటి గౌతమ్ రెడ్డి మరణం తర్వాత అక్కడ వైసీపీ బలహీనపడిందన్న అంచనాలో ఉన్నారు. జగన్ మరోసారి మేకపాటి కుటుంబానికే అక్కడ టిక్కెట్ ఇస్తారని, తాను పోటీ చేస్తా ఈసారి కూడా అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమని, తన పాత నియోజకవర్గాన్ని తన సొంతం చేసుకోవచ్చని ఆనం భావిస్తున్నారట. అందుకోసమే అక్కడి నేతలతో తరచూ సమావేశమవుతున్నారని చెబుతున్నారు. ఆనం అక్కడి నుంచి పోటీ చేస్తే పార్టీకి కూడా టిక్కెట్ల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంటున్నారు. మొత్తం మీద వెంకటగిరిలోమాత్రం ఈసారి ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేసే అవకాశమే లేదు. ఆత్మకూరుకు షిఫ్ట్ అవ్వడం ఖాయమన్నది ఆయన సన్నిహితుల నుంచి వినిపిస్తున్న టాక్

# సేఫ్టీ సర్టిఫికెట్ తప్పని సరి చేసిన గ్రేటర్ కార్పొరేషన్

**హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో ఇటీవల వరుసగా అగ్ని ప్రమాదాలు జరిగాయి. ప్రమాదం జరిగితే మంటలు అదుపు చేయడం ఒక ఎత్తైతే ,మంటల్లో చిక్కుకున్న వారిని ప్రాణాలతో కాపాడటం పెను సవాలుగా మారింది. ఇటీవల ఒకేరోజు సికింద్రాబాద్, జీడిమెట్ల ఇండస్ట్రీయల్ ఏరియాలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ప్రాణనష్టంతో పాటు భారీ స్థాయిలో ఆస్తి నష్టం కూడా సంభవించింది. ముఖ్యంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం అంటే నగరవాసులు హడలిపోతున్నారు. భారీగా మంటలు ఎగసిపడటంతో పాటు వ్యాపార సముదాయాల్లో మంటల్లో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడటం పెనుసవాలుగా మారుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే జీహెచ్ ఎంసీపై నగరవాసుల నుండి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య , వ్యాపార సముదాల్లో ఫైర్ సేఫ్టీ విషయంలో జీహెచ్ఎంసీ మొద్దు నిద్రపోతుందా అంటూ మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టుంది ఉఊఓఅ. నగరంలో ఇకపై చిన్న వ్యాపారస్తులు సైతం తప్పనిసరిగా ఫైర్ మిటిగేషన్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్ తీసుకోవాలనే నిబంధనలు కఠినతరం చేసింది. అగ్ని ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్స్ పొందే మార్గం అందరికీ అందుబాటులో ఉండటంతోపాటు అవగాహన కల్పించే ప్రయత్నం చేసింది. నగరంలో అగ్ని ప్రమాదాల నివారణలో భాగంగా ముందుగా చిన్న చిన్న వ్యాపారస్తులు సుమారు 100 చదరపు మీటర్ల విస్తీర్ణం గల భవనాలు తప్పనిసరిగా ఫైర్ మిటిగేషన్/ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకునేందుకు ప్రక్రియ ప్రారంభించడంతోపాటు వేగవంతం చేసింది. చిన్న, చిన్న షాపులు, వ్యాపారం చేసుకునే ఇంటి యజమానులు గానీ అద్దెకు తీసుకొని 100 చదరపు మీటర్ల కంటే తక్కువ గాని అంతకంటే ఎక్కువ ప్లింత్ ఏరియాలో వ్యాపారం చేసుకునే వారు అగ్ని ప్రమాదాల నివారణకు ఎవరికీ వారే స్వయంగా ఫైర్ మిటిగేషన్/ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకునేందుకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం ద్వారా ఫైర్ మిటిగేషన్/ సేఫ్టీ సర్టిఫికేట్ ను పొందే అవకాశం కల్పించింది. పూర్తి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేసుకుంటే ఈ సర్టిఫికెట్ ను ఆన్ లైన్ ద్వారా జారీ చేసే వెసులుబాటు కల్పించింది. నగరంలో ప్రతి వ్యాపారస్తుడు ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్ పొందేందుకు ముందుకు రావాలని జీహెచ్ఎంసీ సూచించింది.

## ఈడీ, బోడీలకు భయపడం

**మేడ్చల్**

సీఎం కేసీఆర్ ను చూస్తే మోడీకి వణుకు అని, అందుకే బి.ఆర్.ఎస్. నాయకుల మీద ఈ.డి, బోడిలను ప్రయోగిస్తున్నారని కానీ ఎవ్వరికీ భయపడేది లేదన్నారు మంత్రి మల్లారెడ్డి. మేడ్చెల్ జిల్లా పీర్జదిగుడాలో మేడిపల్లి మండలానికి సంబంధించిన 58 జి.ఓ. నంబర్ 509 మంది లబ్ధిదారులకు మంత్రి మల్లారెడ్డి పట్టా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీర్జదిగుడా మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. రాష్ట్రంలో వచ్చేది బి.ఆర్.ఎస్. ప్రభుత్వమేనని ఎవ్వరు ఏం అభివృద్ధి చేశారు ప్రజలకు తెలుసన్నారు మంత్రి మల్లారెడ్డి. బీజేపీ దొంగల పార్టీ అని ఎద్దేవా చేశారు.

## కేసీఆర్ ఒక డిక్టేటర్-వైఎస్ షర్మిల

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు. ఇక్కడ ప్రజల పక్షాన పోరాటం చేసే పరిస్థితి లేదు. . ప్రజల గొంతు వినిపించినా అరెస్ట్ లు చేస్తున్నారు. . మీరు రాష్ట్రంలో జరుగుతున్న దానిపై దృష్టి పెట్టండని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల ప్రధాని నరేంద్ర మోడీ, హోమ్ శాఖ మంత్రి అమిత్ షా,సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ను కోరారు.

షర్మిల మాట్లాడుతూ కేసీఅర్ నియంత అని మరో సారి నిరూపణ అయ్యింది. వైఎస్సార్ బిడ్డకు కేసీఅర్ భయపడుతున్నాడు. అందుకే నన్ను ఆపుతున్నడు. ఇచ్చిన ఒక్క వాగ్దానం కూడా నిలబెట్టుకోలేదు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అనుకున్నాం. జనతా రైడ్ కి పిలుపు నిచ్చాం. ప్రజల సమస్యల మీద పోరాటం చేయాలని అనుకున్నామని అన్నారు.

ఇవ్వాళ ఉస్మానియా ఆసుపత్రి కి వెళ్ళాలని అనుకున్నాం. అక్కడ రోగులకు వైద్యం అందడం లేదు. అక్కడ సమస్యలు ప్రత్యక్షంగా చూడాలని అనుకున్నాం. నేను ఒక్క దాన్ని మాత్రమే వస్త. దమ్మ్ముంటే నాకు అనుమతి ఇవ్వండి. రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని బ్రతకనివ్వడం లేదు. ప్రజల పక్షాన నిలబడితే హౌజ్ అరెస్టులు చేస్తున్నారు. మొన్న రేవంత్ రెడ్డిని హౌజ్ అరెస్ట్ చేశారు. బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ను అరెస్ట్ చేశారు. ప్రజల పక్షాన నిలబడటం తప్పా..? -. కేసీఅర్ ఒక డిక్టేటర్. . ఉస్మానియా ఆసుపత్రి వద్ద టవర్స్ కడతామని కేసీఅర్ హామీ ఇచ్చారు. 200 కోట్ల తో కడతాం అని చెప్పిన హామీ ఏమయ్యిందని ఆమె ప్రశ్నించారు.

## మంత్రుల ఇంటి ముందు ఏబీవీపీ ముట్టడి

**హైదరాబాద్**

ఏబీవీపీ విద్యార్థులు పెద్ద ఎత్తున మినిస్టర్స్ క్వార్టర్స్ ముందు ముట్టడి నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న పనులు ప్రజలకు తెలిసిపోతుందని త్వరలో కేసీఆర్ పోయే రోజు వచ్చాయని తెలియజేశారు. పోలీసులు టిఆర్ఎస్ కుమ్మకై వాళ్లు కూడా మా బాధను కూడా అర్థం చేసుకోకుండా మమ్మల్ని లోపలేయడం ఎంతవరకు న్యాయమని తెలియజేశారు. పేపర్ లీకేజ్ చేసిన వారిపై యాక్షన్ తీసుకోకుండా మాపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని తెలియజేశారు.

## రాజేంద్రనగర్ లో గుప్త నిధుల కలకలం

**రంగారెడ్డి**

రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్ లో గుప్త నిధుల తవ్వకాలు కలకలం సృష్టించాయి. పురాతన బురుజు కోట పక్కన గల ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా గుప్త నిధుల కోసం ఒక ముఠా తవ్వకాలు జరిపింది. అలికిడి విన్న గ్రామస్థులు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తవ్వకాలు జరుపుతున్న 9 మందిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితులకు చెందిన మూడు కార్లతో పాటు 16 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**వరంగల్**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామ శివారు ఆగి ఉన్న టాటా ఏసీ వాహనాన్ని అర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఘటనలో ధరావత్ శ్రీను అనే వ్యక్తి ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. బాధితులు సూర్యపేట జిల్లా చివ్వెంల మండలం రోల్లబండ తండా చెందినవారుగా గుర్తించారు. వీరు మిర్చి లోడు తీసుకొని వరంగల్ వ్యవసాయ మార్కెట్ వెళుతున్న క్రమంలో టాటా ఏసీ వాహనం టైర్ పంచర్ కావడంతో న రోడ్డు ప్రమాదం జరిగింది.

## పెద్ద నాన్నను కడతేర్చిన యువకుడు

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ లో దారుణం జరిగింది. భూ తగదాలతో పెద్దనాన్న చంద్రప్ప (55)ను గొడ్డలితో తమ్ముడి కొడుకు నరికిచంపాడు. హంతకుడు పెద్ద నాన్నను అతి కిరాతకంగా గొడ్డలితో తలను నరికి వేరే దగ్గర పడేసాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దేశంలోనే 24 అంతస్తుల సర్కారీ ఆస్పత్రి

**వరంగల్ :**

వరంగల్ లో రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సదుపాయాలతో నిర్మిస్తున్న 24 అంతస్థుల నూతన మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను సోమవారం నాడు రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తో కలిసి పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియ తిరిగారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వరంగల్ లో 24 అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. హాస్పిటల్ డిజైన్లు,వర్క్ ప్రోగ్రెస్ పరిశీలించారు. మూడు షిఫ్టుల్లో 24 గంటలు పనులు నిరంతరాయంగా జరగాలని అధికారులు, వర్క్ ఏజెన్సీని అదేశించారు. పనులు వేగంగా జరగాలని అందుకు తగ్గట్టుగా మ్యాన్ పవర్ పెంచాలని సూచించారు. పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి అంతస్తు, కోర్ట్ యార్డ్, ఎలివేషన్ ఏరియా పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు అందాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. 24 అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. 42 ఎకరాల్లో, 19 లక్షల స్క్వేర్ ఫీట్ల విస్తీర్ణంలో సుమారు 1200 కోట్ల రూపాయలతో హాస్పిటల్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ హాస్పిటల్ వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, జనగాం, మహబూబాబాద్, ములుగు జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్లో ఏదైతే చికిత్స అందిస్తారో అదే స్థాయిలో వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఉచితంగా మెరుగైన చికిత్స లభిస్తుందని తెలిపారు. ఒక్కో కార్పొరేట్ హాస్పిటల్ కొన్ని విభాగాల్లోనే ప్రత్యేక చికిత్స అందిస్తాయి. వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 30 నుంచి 35 విభాగాల ట్రీట్మెంట్ సేవలు అందనున్నాయని తెలిపారు. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే హాస్పిటల్ నిర్మాణ స్ట్రక్చర్ పనులు 60శాతం పూర్తి అయ్యాయని, ఈ సెప్టెంబర్ నాటికి మొత్తం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. 2023 డిసెంబర్ నాటికి ఆస్పత్రిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఈ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నరని తెలిపారు. సీఎం కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని హైదరాబాద్ చుట్టూ నాలుగు మల్టి స్పెషాల్టీ హాస్పటల్ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. తూర్పు జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు ఎల్బి నగర్ లో, ఉత్తర జిల్లాల నుంచి వచ్చే వారికి అల్వాల్ లో,సిటీలో సనత్ నగర్లో, మరో వైపు గచ్చిబౌలిలోని టిమ్స్ లలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా ఏర్పాటు చేస్తున్నట్లు వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఒక్కో హాస్పిటల్ 900 కోట్ల వ్యయంతో 1000 బెడ్ల సదుపాయంతో నిర్మిస్తున్నామన్నారు. నిమ్స్ హాస్పిటల్లో కూడా 1600 కోట్లతో కొత్తగా 2వేల పడకలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు.

# వరంగల్ కాంగ్రెస్ లో కుమ్ములాటలు

**వరంగల్ :**

ఓరుగల్లు కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. జిల్లా కాంగ్రెస్ నేతలు నాయిని రాజేందర్ రెడ్డి, జంగా రాఘవరెడ్డి బాహాబాహికి దిగారు. గతంలో పార్టీ పెద్దలముందే ముష్టియుద్ధాలకు దిగడంపై నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా ఈ అంతర్గత వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది.తాజాగా వరంగల్ కాంగ్రెస్ లో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. గత ఏడాది మే 6న రాహుల్ వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, స్టార్ క్యాంపేయినర్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ కార్యదర్శి మధుయాస్కీ గౌడ్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారు. కాంగ్రెస్ పెద్దల ముందే వరంగల్ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డిలు బలప్రదర్శనకు దిగారు. వీరి అనుచరులు పోటా పోటీ నినాదాలు చేసుకున్నారు. ఒక దశలో తోపులాట జరిగి అనుచరులు బాహాబాహికి దిగారు. పీసీసీ అధ్యక్షుడు ముందే కాంగ్రెస్ అంతర్గతకుమ్ములాటలు రచ్చకెక్కాయి. దీంతో పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా ఇప్పుడు ఒక్కరిపై ఒక్కరు విమర్శలు చేసుకొని పొలిటికల్ సర్కిల్ లో చర్చగా మారారు.గత కొంతకాలంగా జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డికి మధ్య విభేదాలు ఉన్నాయి. వరంగల్ పశ్చిమ సీటు నాదంటే నాదంటూ పోటాపోటీ ప్రకటనలు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో పోటీ పడి మరీ పర్యటనలు చేస్తున్నారు. ఎలాగైనా ఈసారి నేనే పోటీ చేస్తానని అనుచరులకు చెబుతూవస్తున్నారు.వరంగల్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ లో కల్లోలం చెలరేగింది. మాజీ డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టుగా ఆరోపిస్తూ.. అధిష్టానం ఆదేశాల మేరకు ఆ పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఈ మేరకు జంగా రాఘవరెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక రద్దు, పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారుజనగామ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడిగా ఉండి హనుమకొండలో పాదయాత్రలు, పార్టీ కార్యక్రమాలు చేయడంపై పార్టీ సీరియస్ అయినట్టు తెలుస్తోంది. వరంగల్ పశ్చిమ నుంచి పోటీ చేస్తున్నానని తనకు తానే జంగా రాఘవరెడ్డి ప్రకటించుకోవడంతో వివాదం తెరపైకి వచ్చినట్టు రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలోనే అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసి, పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించినట్లు హనుమకొండ డీసీసీ ప్రెసిడెంట్ నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. పార్టీని అధికారంలో తీసుకొచ్చేందుకు కష్టపడాల్సిన సమయంలో ఇలా అంతర్గత విభేదాలతో కాంగ్రెస్ నేతలు రచ్చకెక్కడంతో ఆ పార్టీపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు.

# సింగరేణి కొలువుల్లోనూ అక్రమాలు

**హైదరాబాద్**

కేసీఆర్ పాలనలో జరిగిన అన్ని ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై అధ్యయనం చేయాలని బీజేపీ టాస్క్ ఫోర్స్ కమిటీ నిర్ణయించింది. అందులో భాగంగా సింగరేణి కొలువుల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో సమాచారం సేకరించేందుకు సిద్ధమైంది. దీంతోపాటు అతి త్వరలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పర్యటించి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవడంతో టీఎస్పీఎస్సీ పరీక్షలకు హాజరైన అభ్యర్థుల అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించింది. ఈరోజు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో టీఎస్పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్.విఠల్ అధ్యక్షతన పేపర్ లీక్ పై ఏర్పాటైన బీజేపీ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో టాస్క్ ఫోర్స్ సభ్యులైన విఠల్ తోపాటు మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కృష్ణ ప్రసాద్, మహిళా మోర్చా జాతీయ నేత కరుణా గోపాల్ హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ వర్చువల్ ద్వారా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై పూర్తి స్థాయిలో సమాచారం సేకరించి నివేదిక రూపొందించాలని నిర్ణయించారు. దీంతోపాటు కేసీఆర్ పాలనలో జరిగిన అవకతవకలపైనా దృష్టి సారించాలని, ముఖ్యంగా సింగరేణి నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై ప్రధానంగా దృష్టి సారించాలని నిర్ణయించారు. ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో ఆధారాలు సేకరించి న్యాయ పోరాటం చేయాలనే సమావేశం నిర్ణయించింది.

# ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం రాజకీయ రంగు

**హైదరాబాద్**

హైదరాబాద్ లో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఫ్లైఓవర్ ను ఇంకా ఎన్ని సంవత్సరాలు కడతారని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. 2018, మే 5వ తేదీన ఉప్పల్ - నారపల్లి ఫ్లై ఓవర్ పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికి ఐదేళ్లు పూర్తైనా కూడా 40 శాతం పనులు కూడా అవ్వలేదని కొంత మంది ఏకంగా పోస్టర్లు అంటించారు. ఆ పోస్టర్లలో ప్రధాని మోదీ ఫోటో ముద్రించి మరీ విమర్శనాత్మకంగా పోస్టర్లను అంటించారు. కాలేదంటూ పోస్టర్లలో తెలిపారు. ఈ ఫ్లై ఓవర్ ఇంకెప్పుడు పూర్తి చేస్తారంటూ పోస్టర్లలో ప్రశ్నించారు.ఆ ఫ్లై ఓవర్‌కు ఉన్న అన్ని పిల్లర్లపైన వరుసగా పోస్టర్లు అంటించుకుంటూ పోయారు. ఇదే విషయంపై మంత్రి కేటీఆర్ మార్చి 27వ తేదీన ట్విటర్ లో స్పందించారు. ఐదేళ్లలో తాము 35 ఫ్లైఓవర్ ప్రాజెక్టులు పూర్తి చేశామని, కేంద్ర ప్రభుత్వం నగరంలోని రెండు ఫ్లైఓవర్లు కూడా కట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. కేంద్రం 2 ఫ్లైఓవర్లు కూడా కట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. గతంలో ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భంలో కూడా హైదరాబాద్ లో ఆయనకు వ్యతిరేకంగా పలు పోస్టర్లు వెలిశాయి.ఉప్పల్, నారపల్లి ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాహనదారులు, స్థానికంగా ఉండే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఈ పిల్లర్లపై ఈ పోస్టర్లు ఎవరు అంటించారు? ఎప్పుడు అంటించారు? ఎవరు చెబితే అంటించారనే చర్చ సాగుతోంది. దీనిపై బీజేపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే బీజేపీని బద్నాం చేసేందుకే పోస్టర్లు అంటించారని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత్ మాల ప్రాజెక్టు కింద ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తుంది. అది నిర్మాణం మొదలు పెట్టి ఐదేళ్లు అయినా ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు 40 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. ఫ్లై ఓవర్‌ను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డికి విన్నవించుకున్నా ఫలితం లేదని అంటున్నారు.

## ఆపరేషన్ శంషాబాద్ విజయవంతం


**రంగారెడ్డి**



శంషాబాద్ లో అక్రమార్కులపై హెచ్ఎండిఏ ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హెచ్ఎండిఏ - పోలీసులు చేపట్టిన ఆపరేషన్ శంషాబాద్ విజయవంతం అయింది. తప్పుడు భూరికార్డు సృష్టించిన ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నం చేసిన కొందరు వ్యక్తుల ప్రయత్నాలను హెచ్ఎండిఏ అధికారులు వమ్ము చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సర్వే నంబర్ 725 -775 లో దాదాపు 50 ఎకరాల హెచ్ఎండిఏ భూములను కబ్జా చేసుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సహకారంతో ఆపరేషన్ శంషాబాద్ హెచ్ఎండిఏ ఎస్టేట్, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు విజయవంతంగా పూర్తి చేసారు.

## అక్రమ బంగారం స్వాధీనం

**రంగారెడ్డి**



శంషాబాద్ ఎయిర్ పోర్టులో కస్టం అధికారులు ప్రత్యేక తనిఖీలు జరిపారు. దుబాయ్ నుండి వేరువేరు విమానాల్లో హైదరాబాద్ వచ్చిన ఇద్దరు స్మగ్లర్ల నుండి సినీ పక్కిలో కిలోకి పైగా బంగారం పట్టివేసారు. 840 గ్రాముల బంగారాన్ని పేస్ట్ గా మార్చి క్యాప్సిల్స్ రూపంలో మలద్వారం లో నిందితుడు అమర్చుకొని వచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. మరో నిందితుడు తునా ఫిష్ ఆయిల్ రూపంలో 233 గ్రాముల బంగారాన్ని తరలిస్తూ పట్టుబడ్డడు. ఇద్దరు స్మగ్లర్ల నుండి 1.73 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

## మహిళా దొంగల ముఠా హల్చల్

**నల్గొండ**

సోమవారం నాడు నల్లగొండ జిల్లా కేంద్రంలో.. సిమెంట్ రోడ్ లో.. కొందరు ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు చిన్నపిల్లలతో అడుక్కొవడానికి అని వచ్చి.. దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డారు. దాదాపు 8 నుంచి పది మంది మహిళలు గుంపుగా పిల్లలతో సహా వచ్చారు. మొదటగా ఇద్దరు ముగ్గురు మహిళలు ఆ దుకాణంలో ఉన్న వ్యక్తిని మాట్లాడుకుంటూ లోనికి తీసుకెళ్లారు. ఆ తర్వాత వెనకాల వచ్చిన ఇద్దరు, ముగ్గురు మహిళలు.. టేబుల్ డ్రాల నుండి 10 తులాల గోల్డ్ దొంగిలించారు. వారి పని ముగియడంతో అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయారు. ఆ తర్వాత 10 తులాల బంగారం పోవడంతో సీసీ కెమెరా నుంచి వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు దుకాణ యాజమానీ. అపరిచితులు కనిపిస్తే పోలీసు వారికి 100 కాల్ చేసి సమాచారం ఇవ్వండని అని స్థానిక పోలీసులు చెబుతున్నారు

## గన్ మిస్ ఫైర్..కానిస్టేబుల్ కు గాయాలు

**సిద్ధిపేట**

సిద్దిపేటలోని ఆర్మడ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ లో గన్ మిస్ ఫైర్ అయింది. మంగళవారం ఉదయం తుపాకులు శుభ్రపరుస్తున్న క్రమంలో గన్ మిస్ ఫైర్ అయ్యి కానిస్టేబుల్ రాజశేఖర్ కు కుడి కన్నుకు తీవ్ర గాయం అయింది. అతడిని అధికారులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వైద్యులు . చికిత్స అందిస్తున్నారు.

## నాగలదిన్నె బ్రిడ్జి పై రాకపోకలు ప్రారంభం

**ఎమ్మిగనూరు**

నియోజకవర్గంలో ఉన్న నందవరం మండలం నాగలదిన్నె గ్రామం నుండి బ్రిడ్జి ప్రారంభించ డానికి సిద్ధమవుతున్న తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కు రాకపోకలు ప్రారంభం×నందవరం మండలం నాగలదిన్నె గ్రామం దగ్గర తుంగభద్ర నది పై నిర్మించిన బ్రిడ్జి 2009 సంవత్సరం లో వరదల కారణంగా కూలిపోయింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడే నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం కొద్దిగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అప్పటి నుండి నిధులు లేకపోవడంతో కాంట్రాక్టరు నిలుపుదల చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందవరం వైసీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ , సీనియర్ నాయకులు కనకవీడు లక్ష్మీకాంత్ రెడ్డి , ముగతి విరుపాక్షిరెడ్డి, ఎంపిపి ముగతి లక్ష్మీదేవమ్మ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లారు. చెన్నకేశవరెడ్డి సీఎం జగన్మోహన్ రెడ్డి గారికి సమస్య వివరించి గత తెదేపా హయాంలో ఉన్న బకాయిలు విడుదల చేయించి, మిగిలిన నిధుల రప్పించి పనులు వేగవంతంగా జరగడం తో నేడు పూర్తి స్థాయిలో పనులు పూర్తి కావడంతో ప్రస్తుతం మట్టి రోడ్డు పై రాకపోకలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. త్వరలోనే బ్రిడ్జి ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి అని సమాచారం.ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి గారికి, మన ప్రియతమ నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి గారికి, నందవరం మండల వైసీపీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ప్రయాణికులు, వాహనదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

# తెలంగాణతో పాటు ముందస్తు అడుగులు

**విజయవాడ**

ముందు చూస్తే నుయ్యి వెనక చూస్తే గొయ్యి .. ఎటూ పోలేని పరిస్థితిలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఉందా అన్న ప్రశ్నకు ప్రజల నుంచీ, రాజకీయ పరిశీలకుల నుంచీ కూడా ఔననే సమాధానమే వస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల విషయానికి వస్తే.. పరిస్థితి ప్రభుత్వానికి అగమ్య గోచరంగా ఉంది. ముందు ముందు తన ఫ్లాగ్ మార్క్ గా చెప్పుకుంటున్న బటన్ నొక్కుడు సంక్షేమం పందేరం చేయడం అసాధ్యంగా మారిపోతుంది. అందుకే పథకాల అమలు ఆగిపోకముందే ముందస్తుకు వెళ్లడమే మంచిదన్న నిర్ణయానికి జగన్ వచ్చేశారని అంటున్నారు. అందుకే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతో పాటే ఏపీ అసెంబ్లీలు కూడా జరిగే విధంగా జగన్ వ్యూహరచనలో ఉన్నారని అంటున్నారు. ముందస్తు ఎన్నికలకు పోదామంటే, ముందుగానే ఇంటికి పోతామని సొంత పార్టీ ఎమ్మెల్యేలే సెటైర్లు వేస్తున్నారు. ఐదేళ్ల సమయం పూర్తయ్యే దాకా ఆగుదామా అంటే.. అయ్యో అలా ఎలా మొదటికే మోసం వస్తుందని మళ్లీ వాళ్లే అంటున్నారు. టుబీ ఆర్ నాట్ టుబి అన్నట్లుగా ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో జగన్ కొట్టుమిట్టాడుతున్నారని పరిశీలకులు అంటున్నారు. అందుకే అధికార పార్టీ నేతలు ముందస్తు ఎన్నికల అట్టును అటూ ఇటూ తిరగేస్తున్నారని విశ్లేషిస్తున్నారు.వాస్తవానికి ముందస్తు ముచ్చటను తెరపైకి తీసుకువచ్చినదే వైసీపీ నేతలు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి కంటే చాలా చాలా ముందుగానే.. ఒకటికి పది సార్లు వైసీసీలో, జగన్ రెడ్డి ప్రభుత్వంలో సకల శాఖల మంత్రిగా చెలామణి అవుతున్న సజ్జల రామకృష్ణా రెడ్డి ఏడాది ఏణ్ణర్థం ముందు నుంచే ముందస్తు ఉందనీ లేదనీ చెబుతూ చర్చను ఎప్పటికప్పుడు సజీవంగా ఉంచుతూ వస్తున్నారు. నిజానికి ప్రతిపక్ష పార్టీలు ముందస్తు ఎన్నికలకు సంబంధించి అధికార పార్టీ వ్యూహాత్మక తప్పటడుగులను, తప్పుటడుగులను పెద్దగా పట్టించుకోవడం లేదు. అలాగే ప్రజలు కూడా ముందస్తు ఉంటుందా, ఉండదా అన్న విషయంపై ఇసుమంతైనా ఆసక్తి చూపడంలేదు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 'ఒక్క ఛాన్స్' మోసానికి గట్టిగానే బదులు తీర్చుకోవాలన్న నిర్ణయానికి వచ్చేశారు. ప్రజల నిర్ణయం, విపక్షాల వ్యూహాలు, ఉద్దేశాలతో పని లేకుండా జగన్ ముందస్తే మార్గమన్న నిర్ణయానికి వచ్చేసినట్లు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీంతో ఏపీలో ముందస్తు ముహూర్తంపై చర్చోపచర్చలు జోరందుకున్నాయి. పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో కూడా అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాలలో వ్యక్తమౌతోంది. జగన్ కూడా అదే సమయానికి ఎన్నికలకు వెళితే బెటర్ అని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకా ఎంత ఆలస్యం చేస్తే అంతగా వైసీపీ నష్టపోతుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమౌతోంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వరకూ ఆగకుండా, వీలైతే అంత కంటే ముందుగా ఎన్నికలు జరిపిస్తే వైనాట్ 175 కాకపోయినా.. కొద్దో గోప్పో స్థానాలను గెలుచుకుని పరువు కాపాడుకునే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఒక సారి ప్రజలలో వ్యతిరేకత ఉందన్న విషయం బయటపడిన తరువాత ఎన్నికలు ఎంత ఆలస్యమైతే విపక్షం అంత బలపడుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఇక చేతులు పూర్తిగా కాలిపోయాయి. ఆకులు పట్టుకున్నా ప్రయోజనం లేదు అన్న భావన పార్టీ నాయకులలోనే వ్యక్తమౌతోంది. అందుకే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో నిర్భయంగా నలుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారు. సాంకేతికంగా అసెంబ్లీలో తెలుగుదేశంకు ఉన్న బలం మేరకే ఓట్లు పడినప్పటికీ.. వాస్తవ బలం కంటే నాలుగు ఓట్లు ఆ పార్టీకి ఎక్కువ పడిన సంగతి సుస్పష్టమే. సొంత పార్టీ ఎమ్మెల్యేలే, ఇంకా ఏడాదికి పైగా ప్రభుత్వానికి గడువు ఉందని తెలిసీ క్రాస్ ఓటింగ్ చేశారంటే.. వారిలో జగన్ సర్కార్ పట్ల ఎంత అసంతృప్తి గూడు కట్టుకుందో అర్థం చేసుకోవచ్చు జగన్ సర్కార్ పై, జగన్ తీరుపై అసంతృప్తి ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య 16 అని అధికార పార్టీ అగ్రనాయకత్వమే నిర్థారణకు వచ్చేసింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆ విషయాన్ని నిఘా పెట్టడం ద్వారా వైసీపీయే తేటతెల్లం చేసింది. క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారంటూ నలుగురిపై సస్పెన్షన్ వేటు కూడా వేసేసింది. ఈ చర్యతో మిగిలిన అంసతృప్తులకు హెచ్చరిక పంపామని వైసీపీ భావిస్తున్నా.. అనర్హత వేటు పడిన తరువాత మేకపాటి మీడియాతో మాట్లాడిన మాటలు 'ఎంతో రిలీఫ్' ఫీలవుతున్నానంటూ చేసిన వ్యాఖ్యలూ ధిక్కారం ప్రదర్శించే విషయంలో ఆయనే కాదు, అసంతృప్తులెవరూ తగ్గేదే లే అన్న మూడ్ లోనే ఉన్నారని అవగతమౌతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

**ఎస్జిటి యూనియన్ జిల్లా అధ్యక్షులు**

**బైరెడ్డి శ్రీధర్ రెడ్డి**

**మంథని**

రాబయే మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తునందున ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి మా ప్రభుత్వం ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని నిరూపించుకోవాలని స్కూల్ గ్రేడ్ టీచర్స్ యూనియన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి శ్రీధర్ రెడ్డి కోరారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం సంపాదిత సెలవులను నగదు మార్చుకొనుటకు బిల్లులు సమర్పించగా వారి జిపిఎఫ్ ఖాతా నుండి కొంత మొత్తం లోన్ కానీ పాక్షిక ఉపసంహారణ కోసం దరఖాస్తు చేసుకొంటే నెలల తరబడి ఎదురు చూపులు తప్పటం లేదన్నారు. కనీసం ఉపాధ్యాయుల సప్లిమెంటరీ శాలరీ బిల్లులు, మెడికల్ బిల్లులను కూడా నెలల తరబడి పెండింగ్ పెట్టితే వారి యొక్క ఆవేదన ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావటం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారన్నారు. ఇప్పటికైనా మన ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఇట్టి విషయం పై ప్రభుత్వం తో సంప్రదింపులు జరిపి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# నూతన సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నంద్యాల**

మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రైతు నగరం నందు కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 35 లక్షల రూపాయలతో నూతన గ్రామ సచివాలయాన్ని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఈషాక్ బాషా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ , వైయస్ఆర్సిపి నాయకులు రామసుబ్బారెడ్డి మరియు రైతు నగరం వైసిపి నాయకులు పాల్గొన్నారు...ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ వార్డు



సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మంచి అవకాశం ఉందన్నారు అలాగే కొన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా సచివాలయాలు నిలిచాయని గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యాన్ని ప్రజలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నంద్యాల నియోజకవర్గ ప్రజల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానుఅన్నారు

# ఎమ్మెల్యే రాపాక ఫోన్ స్విచ్ ఆఫ్

**రాజోలు**

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఏపీ రాజకీయాలను రసకందాయంలో పడేశాయి. ఏడు ఎమ్మెల్సీలు గెలుస్తామని లెక్కలు వేసుకున్న అధికార పార్టీ ఆరింటికే పరిమితం అవ్వడం, తర్వాత రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. తనకు 10 కోట్లు ఆఫర్ వచ్చిందన్న రాపాక, మరో అడుగు ముందుకు వేసి తాను దొంగ ఓట్లతోనే గెలిచానన్నారు. ఆత్మీయ సమావేశంలో మాట్లాడిన రాపాక.. తనపై తానే బాంబు పేల్చుకున్నారు. సొంతూరు చింతలమోరులో పడిన దొంగ ఓట్ల గురించి ఆయనే చెప్పారు.తన అనుచరులు ఒక్కొక్కరు పది చొప్పున ఓటేస్తేనే తనకు 800 ఓట్ల మెజారిటీ వచ్చిందన్నారు. ఈ వ్యాఖ్యలతో జనసేన శ్రేణులు భగ్గుమన్నాయి. దొంగఓట్లతో గెలిచిన నీవు ఎమ్మెల్యే పదవికి అనర్హుడివి అంటూ ఆందోళనకు దిగారు. ఈ పరిణామాల అన్నింటి క్రమంలో రాపాక అజ్ఞాతంలోకి వెళ్లడం మరో చర్చకు దారితీసింది. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అనుచరులకు అందుబాటులో లేకుండా వెళ్లారని ప్రచారం నడుస్తోంది. వివాదస్పద వ్యాఖ్యల నేపథ్యంలోనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మరో వైపు ప్రస్తుతం రాపాక చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అయితే ఆయన ఎరక్కిపోయి ఇరుక్కున్నారా.. సొంత పార్టీ నేతలే ఇరికించారా అన్న అనుమానాలు పెరుగుతున్నాయి. నిన్న మధ్యాహ్నం సఖినేటిపల్లి గ్రామంలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాపాక పాల్గొనాల్సి ఉంది.అయినా ఎమెల్యే అందుబాటులో లేకపోవడం, ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అధికారులు ఆ కార్యక్రమాన్ని తాత్కలికంగా వాయిదా వేశారు. రాపాక వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు చేయాలని జనసేన, వైసీపీ నేతలు సిద్ధమయ్యారు.. రాపాక చేతిలో ఓడిన టీడీపీ అభ్యర్థి దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తానని ప్రకటించారు. దీంతోనే రాపాక ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి.. మిస్ అయ్యారని తెలుస్తోంది. మరి ఆయన ఎక్కడకు వెళ్లారు అన్నదానిపై ఇప్పటి వరకు ఆయన అనుచరులకు తెలియడం లేదు. మరి ఫిర్యాదు అందితే ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోబోతుందనే అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.దొంగ ఓట్ల కామెంట్స్‌పై వివరణ ఇచ్చారు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్. నిన్న సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన వీడియోపై స్పందించారు. 32 ఏళ్ల క్రితం జరిగిన ఘటననే తాను గుర్తు చేశానంటూ డ్యామేజీ కంట్రోల్ చేసే ప్రయత్నం చేశారు రాపాక. అప్పటి సర్పంచ్ ఎన్నికల విషయాన్ని మాట్లాడానని.. 2019 ఎన్నికల్లో ఎస్సీల ఓట్లు తనకు పడలేదంటూ పేర్కొన్నారు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోకి సంబంధించిన ఫుల్ ఫుటేజీని స్వయంగా విడుదల చేశారు ఎమ్మెల్యే రాపాక. ఆ వీడియోలో గతంలో దొంగ ఓట్లు వేసే వాళ్లం అంటూ మాట్లాడారు. అయితే 2019 ఎన్నికలు అనిగాని.. 32 ఏళ్ల క్రితం అని కూడా ఎక్కడా లేదు. అయితే రాపాక దొంగ ఓట్లు వేయించే వాళ్లం అంటూ మాట్లాడడం స్పష్టంగా వినిపిస్తోంది. దొంగ ఓట్ల వల్ల స్పష్టమైన మెజారిటీ వచ్చేదని.. రాబోయే ఎన్నికల్లో పరిస్థితులు మారతాయని.. ప్రతీ ఒక్కరూ కష్టపడి పనిచేయాలంటూ రాపాక ఆ సమావేశంలో మాట్లాడారు.గత ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గ వైసీపీ క్యాండేట్ ఓడిపోడానికి నాయకత్వ లోపమే కారణమన్నారు. జగన్ వేవ్‌లోనూ రాజోలులో వైసీపీ అభ్యర్థి ఓడిపోవడం దారుణమన్నారు. దొంగ ఓట్లతో కాదని.. తనకు సత్తా ఉంది కాబట్టే గెలిచానని బొంతుకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు రాపాక.

# కేంద్రంపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్**

మంత్రి కేటీఆర్ మరోసారి మోడీ సర్కార్‌పై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ అభివృద్ధిపై కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ దేశానికే ఎకానమిక్ ఇంజిన్ అని.. ఇలాంటి నగరాన్ని పట్టించుకోవడం లేదంటూ విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి దేశానికే మంచిదని చెప్పారు. అభివృద్ధికి సహకరించాలని కేంద్రానికి, మోదీకి చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నా అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరని.. ఈ విషయాన్ని తెలుసుకుంటే మంచిదంటూ పేర్కొన్నారు. అభివృద్ధి తాము ఎప్పుడూ ఆకాంక్షిస్తామని.. అవమానించినా అడుగుతూనే ఉంటామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్రంపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. లక్డీకపూల్–నాగోల్–నగర్ విస్తరణకు నిధులు కోరామని చెప్పారు. కానీ సరిపడా ప్రయాణికులు లేరంటూ కేంద్రం లేఖ రాసిందన్నారు.యూపీలో 10 నగరాల్లో మెట్రో కడుతున్నారని.. అన్ని చోట్ల కేంద్రమే నిధులు ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కానీ.. హైదరాబాద్‌కు డబ్బులు ఇచ్చే ఉద్దేశం మాత్రం కేంద్రానికి లేదని కేటీఆర్ విమర్శించారు.

# ఫిజిక్స్‌లో అందరికీ 2 మార్కులు!

**అమరావతి**

రాష్ట్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా మార్చి 27న సెకండియర్ ఫిజిక్స్ పరీక్ష నిర్వహించారు. దీనిలో ఇంగ్లిష్ మీడియం పేపర్లో తప్పులు దొర్లినట్లు ఇంటర్ బోర్డు గుర్తించింది. దీంతో పరీక్షలు రాసిన విద్యార్థులందరికీ 2 మార్కులు కలపుతామని బోర్డు ప్రకటించింది. ఫిజిక్స్ పేపర్ 2లోని మూడో ప్రశ్న తప్పుగా ఇచ్చినట్లు ఇంటర్ బోర్డు గుర్తించింది.తెలుగు మీడియం ప్రశ్నపత్రంలో మూడో ప్రశ్నగా ఆయస్కాంత ప్రవణత (అవపాతము)ను నిర్వచించుము? అని రాగా, ఆంగ్ల మాధ్యమ ప్రశ్నపత్రంలో డిఫైన్ మ్యాగ్నటిక్ డెక్లినేషన్ అని తప్పుగా ప్రచురితమైంది. దానికి బదులుగా డిఫైన్ మ్యాగ్నటిక్ ఇన్‌క్లినేషన్ ఆర్ యాంగిల్ ఆఫ్ డిప్ అని రావాల్సి ఉంది. దీనికి పరీక్ష కేంద్రాలకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి సందేశాలు పంపించారు.కొన్నిచోట్ల ఆ విషయం విద్యార్థులకు చెప్పగా, మరికొన్నిచోట్ల ఆ విషయం వారికి చేరలేదు. నంద్యాల జిల్లా డోన్ పట్టణ సమీపంలోని ఆదర్శ కళాశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు నిర్వాహకులు ఈ విషయం చెప్పకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తప్పుగా వచ్చిన ప్రశ్నకే తాము సమాధానం రాశామని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రశ్న తప్పుగా రావడాన్ని పరిగణనలోకి తీసుకొని ఇంటర్మీడియట్ రెండో ఏడాది భౌతికశాస్త్రం పరీక్షలో ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకు రెండు మార్కులను కలపనున్నారు. ప్రశ్నపత్రంలోని మూడో ప్రశ్నకు జవాబు రాసినా, రాయకపోయినా 2 మార్కులు ఇవ్వాలని ఇంటర్ విద్యామండలి నిర్ణయించింది.మార్చి 16 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయిన విషయం తెలిసిందే. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 15 నుంచి 25 వరకు, ఏప్రిల్ 30 నుంచి మే 10వరకు నిర్వహించనున్నారు. రోజూ రెండు విడతల్లో ఆదివారం కూడా జరుగుతాయి.ఈఏడాది రాష్ట్రంలో మొత్తం 10,03,990 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో ఫస్టియర్ విద్యార్థులు 4,84,197 మంది ఉండగా.. సెకండియర్ విద్యార్థులు 5,19,793 మంది ఉన్నారు. 1,489 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని కేంద్రాల్లోనూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

# నోటీసులు మాకు..సమాచారం కేటీఆర్ కు

**కేటీఆర్ కనుసన్నల్లోనే సిట్ విచారణ**

**సిట్ అధికారి శ్రీనివాస్ ట్రాక్ రికార్డు సరిగ్గా లేదు**

**సీబీఐ, ఈడీ, ఏసీబీలతో ప్రత్యేక సిట్ వేయాలి**

**ఫిర్యాదుకు సీబీఐ, ఈడీ డైరెక్టర్లు సమయం ఇవ్వడం లేదు**

**టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి**

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రశ్నించినందుకు తమకు నోటీసులు ఇస్తున్నారని.. దోపిడీ దొంగతనం చేసిన కేటీఆర్ కు సమాచారం ఇస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండిపడ్డారు. సిరిసిల్లలో నిన్న జరిగిన ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ అంశంపై మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.ఈ కేసులో బ్యాంకు లావాదేవీల కంటే ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా జరిగాయి. కోట్ల రూపాయలు చేతులు మారాయి, మనీలాండరింగ్, హవాలాతోపాటు విదేశాల్లో లావాదేవీలు జరిగాయి. కాబట్టి సిట్ ఒక్కటే ఈ కేసును విచారించలేదు. కాబట్టి సీబీఐ, ఈడీ, ఏసీబీ శాఖలతో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాల్సిందే అని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలు గత రెండు, మూడు రోజులుగా అపాయింట్‌మెంట్ అడుగుతుంటే సీబీఐ, ఈడీ డైరెక్టర్లు తమకు సమయం ఇవ్వడం లేదన్నారు. ఈ మీడియా సమావేశం చూసి అయినా తమకు వెంటనే అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కేసులో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు కాబట్టి అవినీతి నిరోధక చట్టం కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కానీ సిట్ అవినీతి నిరోధక చట్టం కింద ఒక్క సెక్షన్ కూడా పెట్టలేదు. అవినీతి నిరోధక చట్టం కింద కేసులు పెడితే..ఈ కేసులు ఏసీబీ పరిధిలోకి వెళ్తాయి. ఏసీబీ కోర్టుకు క్రిమినల్ కేసులను కూడా విచారించే అధికారం ఉంటుంది. తద్వారా విచారణ త్వరగా ముగుస్తుంది. సీబీఐకి కేసు ఇస్తే ఈడీ కూడా వస్తుంది. అప్పుడు ఇంకా సత్వరంగా కేసులు తేలే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం నిందితుల మీద పెట్టిన సెక్షన్లు, సాధారణ కోర్టుల్లో విచారణ జరిగితే ఈ కేసు తేలడానికి ఏళ్ల సమయం పడుతుందని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ కేసు నుంచి మంత్రి కేటీఆర్ తప్పించుకోవడానికి.. ఎదురుదాడి చేస్తూ.. విచారణ అధికారులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిడి తీసుకువస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేపర్ లీకేజీ విషయాన్ని తామే పసిగట్టామని కేటీఆర్ చెప్పడం అబద్ధం అన్నారు. డబ్బు పంపకాల్లో వచ్చిన తేడాల వల్లే.. నిందితుల ద్వారా ప్రశ్నపత్రాల లీకేజీ బయటపడిందన్నారు. దీన్ని కప్పిపుచ్చడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు రావడంతో విధిలేని పరిస్థితుల్లోనే టీఎస్పీఎస్సీ బేగంపేట పీఎస్ లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును పక్కదారి పట్టించేందుకు, ప్రభుత్వ పెద్దలను కాపాడేందుకు ప్రభుత్వం కేసును సిట్ కు అప్పగించింది.తెలంగాణలో ఏదైనా సంచలన సంఘటనలు జరిగినప్పుడు.. అందులో ప్రభుత్వ పెద్దల పాత్ర కనిపించినప్పుడు... వారిని కాపాడేందుకు, సమస్యను పక్కదారి పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసారి సిట్ ను నియమిస్తోందని చెప్పారు. ఎంసెట్, నయీం కేసుల నుంచి మొదలు ఇప్పటివరకూ వివిధ కేసుల్లో సిట్ ఒక్క నివేదికను కూడా ఇవ్వలేదని, నిందితులపైనా చర్యలు తీసుకోలేదని చెప్పారు. టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రశ్నించినందుకు సిట్ మాకు నోటీసులు, కేటీఆర్ కు సమాచారాన్ని ఇస్తోంది. సిట్ విచారణ కేటీఆర్ కనుసైగల్లోనే జరుగుతోంది. సిట్ విచారణ నివేదికను కోర్టుకు ఇవ్వకముందే జగిత్యాలలో పరీక్ష రాసిన వారి సమాచారం కేటీఆర్ కు ఎలా వచ్చింది. ఈ ఇష్యూలో కేటీఆర్ పీఏ తిరుపతి చిన్న పావు మాత్రమే అని అన్నారు. కేటీఆర్ వద్ద నిర్దిష్టమైన సమాచారం ఉంది. ఆయనకు నోటీసులు ఇవ్వకపోగా మాపై క్రిమినల్ కేసులు పెడతామని మీడియాకు లీకులు ఇచ్చారు. కేటీఆర్ కు సమాచారం నేరగాళ్లు ఇచ్చరా?.. విచారణ అధికారి ఇచ్చారా? ఈ సమాచారం ఎవరిచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి. మాకు నోటీసులు ఇచ్చిన ఏఆర్ శ్రీనివాస్ కేటీఆర్ కు ఎందుకు ఇవ్వరు? దీని వెనక గూడుపుఠానీ ఏమిటి? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. లీకేజీ వ్యవహారంతో కేటీఆర్ కు సంబంధం లేనప్పుడు.. సిట్ విచారణ జరుగుతున్న సమయంలో.. నివేదిక ఇంకా పూర్తి కాకముందే.. మంత్రి కేటీఆర్ కు పూర్తి సమాచారం ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. కేటీఆర్ కు సమాచారాన్ని ఎవరు ఇస్తున్నారో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# తుగ్గలిలో సీతారాముల కళ్యాణ,రథోత్సవ వేడుకలు

**తుగ్గలి**

శ్రీ రామనవమి పురస్కరించుకొని 30వ తేదీ,గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలో శ్రీ సీతారాముల కళ్యాణం మరియు రథోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. 29న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నందు నవగ్రహ పూజా మరియు రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. 30వ తేదీన ఉదయం ప్రతాపరెడ్డి నివాసం నుండి కలశ స్థాపన,మధ్యాహ్నం నాగేంద్ర దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు.సాయంకాలం గ్రామ ప్రజల మరియు పెద్దల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల రథోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

















Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.  EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509036  RNI/APTEL/2021/80950